- ఇప్పుడు జనంలోకి ఎలా వెళ్లాలి..?
- వైసీపీ అభ్యర్థుల్లో గుబులు.. దిగులు
- టీడీపీ సూపర్ సిక్స్ ముందు దిగదుడుపు
- పెంచన్, ఉద్యోగాలు, రైతు భరోసా.. అన్నీ అంతే..



వైసీపీ అధినేత, సీఎం జగన్ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో 'కొత్త సీసాలో పాత సారా' అని జనం పెదవి విరుస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మేనిఫెస్టోనే మళ్లీ విడుదల చేయడంతో ఆ పార్టీ శ్రేణులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. ఏదో ఉంటుందని ఆశించిన వైసీపీ అభ్యర్థులు మరింత దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కుడుకే ప్రాధాన్యమిచ్చారు. అభివృద్ధిని మరిచారు. ఇదే అంశం అభ్యర్థులను భయపెడుతోంది. ప్రజలకు ఏం చెప్పి ఓట్లు అడగాలో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇలాంటి తరుణంలో మేనిఫెస్టో తమకు ఊపిరినిస్తుందని అభ్యర్థులు భావించారు. కానీ వారి ఆశలు ఆవిరయ్యాయి. 175కు 175 స్థానాలు గెలవబోతున్నామని ముఖ్యమంత్రే చెబుతుంటే.. మేనిఫెస్టోలో ఏదో అద్భుతం ఉంటుందని వైసీపీ అభ్యర్థులు ఆశల పల్లకిలో ఊరేగారు. మేనిఫెస్టో చూసిన తరువాత ఉసూరుమన్నారు.


(ఆంధ్రజ్యోతి) అనంతపురం





ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం 43.0 28.0

మరింత ఇరకాటం



నాడు హంద్రీనీవా నీటి గలగలలు (ఫైల్)

గత ఎన్నికల్లో కరువు జిల్లా అనంతకు ఇచ్చిన హామీల అమలు విషయాన్ని మేనిఫెస్టోలో ప్రత్యేకంగా కనబరచలేదు. హంద్రీనీవా విస్తరణ, హెచ్ఎల్సీ ఆధునికీకరణ, భైరవాన్‌తిప్ప, పేరూరు, ఉంతకల్లు, రాప్తాడు నియోజకవర్గంలో మూడు రిజర్వాయర్ల నిర్మాణం హామీని జగన్ నెరవేర్చలేదు. ఈ హామీలు సైతం ఆ పార్టీ అభ్యర్థులను వెంటాడుతున్నాయి. ఈ పరిణామాలు వైసీపీ అభ్యర్థులను మరింత ఇరకాటంలో పడేస్తాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ముంచావు కదా జగన్..!

మేనిఫెస్టోలో కొత్తగా ఏమీ లేదే..


వైసీపీ అభ్యర్థుల్లో అలజడి

పాత మేనిఫెస్టోతోనే ప్రజల్లోకి వెళ్లాల్సి రావడంతో వైసీపీ అభ్యర్థుల్లో అలజడి మొదలైంది. మేనిఫెస్టో విడుదల చేయకపోయా ఏదోలా ప్రచారం చేసుకునేవారమని, బటన్ నొక్కుడు కార్యక్రమాన్ని చెప్పుకొనైనా ప్రజల్లోకి వెళ్లి ఉంటే కొంతలో కొంత బాగుండేదని అంటున్నారు. ఇప్పుడు పాత అంశాలతో వెళితే పరువుపోతుందని ఆవేదన చెందుతున్నారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతో పోలిస్తే.. వైసీపీ మేనిఫెస్టో అంశాలు ప్రజలను ఉత్తేజపరిచేలా లేవన్న అభిప్రాయం వైసీపీ అభ్యర్థుల్లో వ్యక్తమౌతోంది. ప్రతి నెలా రూ.4 వేల పింఛన్ ఇంటి వద్దే ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. కానీ జగన్ అంతకంటే తక్కువ పింఛన్ ఇస్తామనడం ఏమిటో అర్థం కాలేదని వైసీపీ అభ్యర్థులు వాపోతున్నారు. ఉద్యోగాలు భర్తీ, జాబ్ క్యాలెండర్ గురించి మేనిఫెస్టోలో క్లారిటీ లేదు. దీంతో నిరుద్యోగ యువత ఓట్లు వైసీపీకి అవసరం లేదనే సంకేతాలను జగన్ పంపినట్లుందని ఆందోళన చెందుతున్నారు. రైతు భరోసా సొమ్ము పెంపు విషయంలోనూ టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతో పోలిస్తే వెనకడుగే శారు. దీంతో రైతులు సైతం వైసీపీకి దూరమౌతారన్న భావన వ్యక్తమౌతోంది. మహిళలకు, విద్యార్థులకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చే విషయంలోనూ మేనిఫెస్టోలో తప్పటడుగులే కనిపించాయనే అభిప్రాయం ఆ పార్టీ వర్గాల నుంచే వ్యక్తమవుతోంది.

వైసీపీ మేనిఫెస్టోతో పోలిస్తే టీడీపీ సూపర్ సిక్స్ పథకాలే భేష్ అనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. వైసీపీ మేనిఫెస్టోలో రైతు భరోసా కింద ఏడాదికి రూ.16 వేలు ఇస్తామన్నారు. అందులో కేంద్రం వాటా రూ.6 వేలు ఇప్పటికే అమలవుతోంది. సూపర్‌సిక్స్‌లో భాగంగా రైతుకు ఏటా రూ.20 వేలు ఇస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. దీనికి తోడు 90శాతం సబ్సిడీతో రైతుకు డ్రిప్, స్ప్రింక్లర్లు ఇస్తామన్నారు.

సూపర్ సిక్స్..

పింఛన్ విషయంలో వైసీపీ వెనకడుగు వేసింది. మొదటి మూడేళ్లు రూ.3 వేలు, ఆ తరువాత 2028లో రూ.250, 2029లో మరో రూ.250 పెంచుతామని చెప్పారు. మొత్తం మీద రూ.3500 ఇస్తామని జగన్ ప్రకటించారు. టీడీపీ మాత్రం ఈ ఏడాది ఏప్రిల్ నుంచే ఏకంగా రూ.4 వేలు ఇస్తామని పేర్కొంది. దివ్యాంగులకు పింఛన్ రూ.6 వేలు, అమ్మఒడి పథకం ద్వారా ఇక నుంచి రూ.17 వేలు ఇస్తామని వైసీపీ మేనిఫెస్టోలో జగన్ ప్రకటించారు. ఒక ఇంట్లో ఎంత మంది ఉన్నా... ఒకరికే ఈ పథకం వర్తిస్తోంది. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల్లో తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలున్నా.. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తానని ప్రకటించారు. మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం హామీ ఇచ్చారు. నిరుద్యోగులకు ఐదేళ్లల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని బాబు స్పష్టం చేశారు. ఉద్యోగం వచ్చేంత వరకూ నెలకు రూ.3 వేలు యువగళం నిధి కింద భృతి ఇస్తామన్నారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించారు. 50 ఏళ్లు పైబడిన బీసీలకు పింఛన్ అమలు చేస్తామన్నారు. ఇలా వైసీపీ మేనిఫెస్టోకి, టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతో పోలిస్తే పొంతన లేదనే అభిప్రాయం అన్ని వర్గాల ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.





కూటమిదే అధికారం

వైసీపీ మేనిఫెస్టోలో పొందుపరిచిన పథకాలు, వివిధ అంశాలను పరిశీలించిన తరువాత ఈ ఎన్నికల్లో కూటమిదే విజయమని, కూటమిదే అధికారమని మేధావి వర్గాలు, రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబు సిద్ధాంతమని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాల బటన్ నొక్కుడుకే అధిక ప్రాధాన్యమిచ్చారని, అభివృద్ధి దిశగా ఆశించినంత స్థాయిలో చొరవ చూపలేదని ఆ వర్గాలు అంటున్నాయి. కరువు జిల్లా అనంతలో టీడీపీ, వైసీపీ పాలనలలో జరిగిన అభివృద్ధిని పరిశీలిస్తే తేడా స్పష్టంగా కనిపిస్తోంది. టీడీపీ కియతోపాటు అనుబంధ పరిశ్రమలను జిల్లాకు తెచ్చింది. దీంతో ప్రత్యక్షంగా 8 వేల మందికి.. పరోక్షంగా 10 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాకు ఏ ఒక్క పరిశ్రమ రాలేదు. ఏ ఒక్కరికీ ఉద్యోగావకాశాలు దక్కలేదు. అన్ని రంగాలలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

అంతా నా ఇష్టం..!



అనంతపురం విద్య, ఏప్రిల్ 27: సమగ్రశిక్ష ప్రాజెక్టులో ఓ ఉన్నతాధికారి బరితెగించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా ఖాతరు చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టారు. బుక్కరాయసముద్రంలోని శిక్షణా కేంద్రానికి ఓ కంప్యూటర్ ఆపరేటర్‌ను అనామతుగా తీసుకున్నారు. ఉద్యగం భర్తీ పేరిట దరఖాస్తు కూడా స్వీకరించారని విశ్వసనీయ సమాచారం. 'కలెక్టర్‌కు మనం ఎంత చెబితే అంత..' అని.. గతంలో పనిచేసి ఓ కలెక్టర్ గురించి చెప్పుకునే ఆ అధికారి.. అదే ధీమాతో నియామక చర్యలకు పూనుకున్నారని తెలిసింది. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఓ మహిళ నుంచి దరఖాస్తు తీసుకున్నారని సమాచారం. నెల రోజులకు పైగా ఆమెతో పనులు కూడా చేయిస్తున్నారని తెలిసి.. ఆ శాఖలోనివారే విస్తుపోతున్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



ఈశ్వరప్ప (ఫైల్)

గుమ్మఘట్ట, ఏప్రిల్ 27: మండల పరిధిలోని కేఎస్ దొడ్డి గ్రామానికి చెందిన ఈశ్వరప్ప(40) వడదెబ్బతో మృతి చెందాడు. గ్రామ సమీపంలోని కొండపై ఉన్న తమ ఇలవేల్పు దర్శనానికి శుక్రవారం కాలినడకన వెళ్లివచ్చిన ఈశ్వరప్ప తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతన్ని శుక్రవారం రాత్రి రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈశ్వరప్ప టీడీపీ కార్యకర్త కావడంతో ఆ పార్టీ నాయకులు కాలవ సన్నన్న, పాలయ్య, బేలోడు సంజీవ తదితరులు నివాళులు అర్పించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల సాయం అందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 27: పరిగి మండలం కొడిగెనహళ్లిలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో (సేవామందిరం) ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా ఏడీ అబ్దుల్ రసూల్ కోరారు. 40 శాతం అంధత్వం ఉన్న విద్యార్థులు.. సదరం సర్టిఫికెట్, పుట్టిన తేదీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ లేదా పాఠశాల బదిలీ సర్టిఫికెట్, రేషన్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 8008889815, 08556-297796 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

అబార్షన్ మరణంపై విచారణ

పోలీసులకు వైద్యాధికారుల ఫిర్యాదు



ఖురేషి ఇంటిని సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 27: పట్టణంలోని కథల వీధిలో గర్భిణి మాధవికి అబార్షన్ చేసి.. ఆమె ప్రాణాలను బలితీసుకున్న ఫర్హానా, ఆమె తల్లి ఖురేషిపై ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా పీపీ యూనిట్ అధికారి డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి శనివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వజ్రకరూరుకు చెందిన గర్భిణి మాధవికి వీరు అనధికారికంగా తమ ఇంట్లో అబార్షన్ చేశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె మృతిచెందారు. ఫర్హానా ఇంటిని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, డీపీఎంఓ డాక్టర్ రవిశంకర్, డెమో సెక్షన్ అధికారులు ఉమాపతి, త్యాగరాజు శనివారం పరిశీలించారు. తల్లి, కూతురు కొన్నేళ్ల నుంచి అనధికారికంగా ఇంట్లోనే కాన్పులు, అబార్షన్‌లు చేస్తున్నారని గుర్తించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఖురేషి ఆయాగా పనిచేసింది. ఆమె కూతురు ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసింది. ఆమె ఏఎన్ఎం కోర్సు చేసినట్లు విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. వారి ఇంటిని సీజ్ చేశారు. తల్లీకూతుళ్లను విచారిస్తే.. లింగ నిర్ధారణ, భ్రూణ హత్యల గురించి మరిన్ని వివరాలు బయటపడే అవకాశం ఉంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.

సార్.. మీ కాళ్లు పట్టుకుంటా..!

నా కొడుకును పరీక్ష రాయనివ్వండి
ఎస్ఎస్‌బీఎన్ వద్ద విద్యార్థి తల్లి కంటతడి.. ఆలస్యానికి అనుమతించని పాలిసెట్ అధికారులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 27: తన కుమారుడి చేత పాలిసెట్ రాయించేందుకు ఓ తల్లి పడ్డ ఆవేదన అందరినీ కలిచివేసింది. కానీ అధికారులు మాత్రం కనికరం చూపలేదు. అనంతపురం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల కేంద్రంలో పాలిసెట్ రాసేందుకు గుత్తి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన నితిన్.. తన తల్లి లక్ష్మీదేవితో కలిసి శనివారం వచ్చాడు. ఉదయం 8 గంటలకే బయలుదేరినా.. బస్సులు, ఆటోలు సమయానికి దొరక్కపోవడం, ట్రాఫిక్ సమస్య కారణంగా ఆలస్యమైంది. పరీక్ష ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగా.. వారు 11.05 గంటలకు కళాశాల వద్దకు చేరుకున్నారు. నితిన్ పరుగున వెళ్లినా.. అప్పటికే ప్రధాన గేటు మూసివేశారు. అక్కడి సిబ్బందిని బతిమాలినా అనుమతించలేదు. కుమారుడు పరీక్ష రాసేందుకు వెళ్లాడని భావించిన తల్లి.. బయటే ఉండిపోయింది. కానీ కుమారుడు ఏడుస్తూ తిరిగిరావడంతో ఆమె తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. కుమారుడితో కలిసి పరుగు పరుగున ప్రధాన ద్వారం వద్దకు వెళ్లి అధికారులను బతిమాలారు. అయినా కనికరించకపోవడంతో కంటతడి పెట్టుకున్నారు. 'సార్.. మీ కాళ్లు మొక్కుతా.. నా కొడుకును లోపలికి పంపండి. వాడి భవిష్యత్తును నాశనం చేయకండి సార్' అని ఆమె విలపించారు. కూలి పనులు చేసి కొడుకును చదివిస్తున్నానని, పదో తరగతిలో 506 మార్కులు సాధించాడని ఆమె తెలిపారు. అదే సమయానికి మరో నలుగురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అక్కడికి వచ్చారు. వారందరూ ఎంత వేడుకున్నా అధికారులు గేటు తీయలేదు. ఏం చేయాలో తోచక డయల్ 100కి ఫోన్ చేశారు. ఇద్దరు కానిస్టేబుల్స్ అక్కడికి చేరుకుని విషయం తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడేసరికి సమయం 11.40 అయింది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు నిరాశగా వెనుదిరిగారు. జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలలో ఆలస్యం కారణంగా కొందరు విద్యార్థులు పరీక్షలు రాయలేకపోయారు. జిల్లా వ్యాప్తంగా 8,898 మంది విద్యార్థులకుగాను 1,081 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు.



విద్యార్థి నితిన్, తల్లి లక్ష్మీదేవి కంటతడి..



ఎస్ఎస్‌బీఎన్ కాలేజీ గేటు వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

ఇంత కఠినమా..?



నార్పల నుంచి నగరంలోకి వచ్చేసరికి ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో 11.07 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకున్నాను. నా కూతురును పరీక్షకు అనుమతించలేదు. ప్రభుత్వ అధికారులు ఇంత కఠినంగా వ్యవహరిస్తే ఎలా? విద్యార్థులు, తల్లిదండ్రులు వేడుకున్నా అధికారులు స్పందించకపోవడం దారుణం. పోలీసులు వచ్చి అడిగినా పట్టించుకోలేదు. విద్యార్థులను పరీక్షలు రాయనివ్వకపోవడమే ప్రభుత్వం పనిగా పెట్టుకున్నట్లుంది.

- రామాంజనేయులు, విద్యార్థిని తండ్రి, నాయనవారిపల్లి

అనుమతించలేదు..



ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చానని పరీక్షకు అనుమతించలేదు. సిద్ధరాంపురం నుంచి అనంతపురం రావడానికి ఆటోలు, బస్సులు దొరకలేదు. దీంతో పరీక్షా కేంద్రానికి రావడానికి ఆలస్యమైంది. అధికారులను వేడుకున్నా గేటుతీయలేదు. ఏడాదికి ఒకసారి మాత్రమే నిర్వహించే పాలిసెట్‌ను మళ్లీ రాయలేం. కష్టపడి చదివాను. శ్రమ వృథా అయింది.

- చందన, విద్యార్థిని

నేడు తాడిపత్రికి జగన్

భారీగా పోలీసు బందోబస్తు.. యథావిధిగా చెట్ల నరికివేత



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 27: ఎన్నికల ప్రచారం నిమిత్తం సీఎం వైఎస్ జగన్ తాడిపత్రికి ఆదివారం వస్తున్నారు. పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో నిర్వహించే బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారు. పుట్లూరు రోడ్డులోని కర్నూలు వెంచర్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు ఉదయం 10 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో వైఎస్సార్ సర్కిల్‌కు చేరుకుంటారు. 10:15 గంటలకు సభలో ప్రసంగిస్తారు. ఆ తరువాత తిరుపతి జిల్లా వెంకటగిరికి బయలుదేరుతారు. సీఎం పర్యటనకు ఎస్పీ బర్దర్ నేతృత్వంలో 1200 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అడిషనల్ ఎస్పీలు ఇద్దరు, డీఎస్పీలు 10 మంది, సీఐలు 30 మంది, ఎస్ఐలు 50 మంది సీఎం భద్రతలో పాల్గొంటారు. సీఎం పర్యటన నేపథ్యంలో వైఎస్సార్ సర్కిల్‌లో పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. పట్టణంలోని పలు వీధులు, ప్రధాన రహదారుల్లో కవాతు నిర్వహించారు. రెండు రోజుల ముందు నుంచి పోలీసులు తాడిపత్రిని తమ అధీనంలోకి తీసుకున్నారు. పట్టణంలో ఎక్కడచూసినా పోలీసులే కనిపిస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మరోవైపు సీఎం ప్రయాణించే మార్గంలోని పలు చెట్లను అధికారులు నరికించివేశారు. ముఖ్యమంత్రి పర్యటన ఎక్కకడున్నా చెట్ల నరికివేత ఆనవాయితీగా మారిందన్న విమర్శలు వస్తున్నాయి.

ఎందుకు నరికారో చెప్పండి

మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: పట్టణంలోని పుట్లూరు రోడ్డులో చెట్లను ఎందుకు నరికేశారో చెప్పాలని ఎమ్మెల్యే పెద్దారెడ్డిని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి నిలదీశారు. తన నివాసంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం తాడిపత్రికి రావడాన్ని స్వాగతిస్తున్నామని, కానీ చెట్లను ఎందుకు నరుకుతున్నారో అర్థం కావడం లేదని అన్నారు. చెట్లు ఏం పాపం చేశాయో తనకు తెలియడం లేదని ఎద్దేవా చేశారు. 'ఎమ్మెల్యే అయిన తర్వాత రెండేళ్లు చెట్ల జోలికి పోకుండా బాగానే ఉన్నావు కదా?' అని పరోక్షంగా చీనీ చెట్ల నరికివేత సంస్కృతి ప్రస్తావిస్తూ.. పెద్దారెడ్డిని ఎద్దేవా చేశారు. చెట్లను నరికే సంస్కృతిని ఎమ్మెల్యే ఇంకా మరిచిపోలేదని అర్థమవుతోందని అన్నారు. తాము ఎంతో కష్టపడి చెట్లను పెంచితే.. వాటిని నరికి శునకానందం పొందుతున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చదనం అంటే ఎమ్మెల్యేకు నచ్చదని విమర్శించారు. ఎన్నికల తర్వాత చెట్లకు బదులు మనుషులను నరుకుతారా? అని ప్రశ్నించారు. సీఎం జగన్ పచ్చదనం పట్ల ప్రేమ లేదని అన్నారు. మున్సిపల్ డీఈ దగ్గరుండి చెట్లను నరికివేయిస్తే ఏమని అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. డీఈని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో అప్పటి సీఎం కేసీఆర్ పచ్చదనం కోసం చేసిన ఖర్చు దేశంలో ఎవరూ పెట్టలేదని అన్నారు. ప్రధాని మోదీ, దేశంలోని పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎక్కడ పర్యటించినా చెట్ల జోలికి వెళ్లరని, మన రాష్ట్రంలో మాత్రమే సీఎం వస్తున్నారంటే చెట్లను నరికేస్తున్నారని విమర్శించారు.




గ్రామాల్లో అందరిదీ ఒకేమాట

ఎం.సుబ్బరాయుడు, కురుగుంట, అనంతపురం రూరల్ మండలం

ఇప్పట్లాగా అప్పట్లో అభ్యర్థుల ఇంటింటి ప్రచారం చేసేవారు కాదు. అప్పుడు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు మాత్రమే ఉండేవి. ఆ పార్టీ అభ్యర్థులు ఊర్లోకి రావడం, గ్రామంలోని రెడ్డి, కరణం, ఊరిపెద్దలు ముగ్గురు లేదా నలుగురితో సమావేశమై మాట్లాడేవారు. మన ఊళ్లోని వారందరిని మన పార్టీకి ఓటు వేయమని చెప్పి వెళ్లిపోయేవారు. గ్రామాల్లో అందరిదీ ఒకే మాటగా ఉండేది. అప్రకారమే ఓట్లు వేసేవాళ్లం. ఓటర్లు డబ్బు ముఖం ఎరుగరూ. మనుషుల మధ్య గొడవలు, కుట్రలు, అసూయ, వర్గాలు వంటివీ ఏవీ కనిపించేవి కావు. అప్పటి నాయకులు ప్రసంగాలు సమస్యలపై ఆసక్తిగా ఉండేవి. వారి మాటలకే ఓట్లు వేసేవాళ్లు. రైతులైతే కాటేద్దుల గుర్తు కనిపిస్తే చాలు ఓట్లు గుద్దేసేవారు. అంత అభిమానం. ఆ తరువాత ఆ స్థాయిలో ఎన్టీ రామారావు ప్రసంగాలు ప్రజలను ఉత్తేజ పరిచేవిధంగా ఉండేవి. ఇప్పుడూ చెప్పుకోకూడదు. అంత అధ్వానంగా మాట్లాడుతున్నారు.

- అనంతపురం రూరల్



ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తామంటే వద్దన్నా

రంగారెడ్డి, రిటైర్డ్ హెచ్ఎం

నేను కాలేజీ విద్యార్థిగా ఉన్న రోజుల నుంచి దివంగత ఎన్టీఆర్‌కు అభిమానిని. 1983లో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించే సమయానికే యువకుడిగా నాకు రాజకీయాలపై ఆసక్తి ఉండేది. పార్టీపెట్టిన తరువాత ఎన్టీఆర్ హిందూపురం నుంచి చైతన్య రథంపై ప్రచారం చేస్తూ చెన్నేకొత్తపల్లికి వచ్చారు. ఆ సమయంలో ఎంతో ఉత్సాహంతో ఆయనకు పెద్ద ఎత్తున స్వాగతం పలికాం. ఈక్రమంలో యువకుడిగా ఉన్న నేను ఎన్టీఆర్ దృష్టిలో పడ్డా. పెనుకొండ నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపిక కోసం చేస్తున్న కసరత్తులో నా పేరు కూడా పరిశీలనకు వచ్చిందట. పార్టీకి చెందిన ఓ ముఖ్యనాయకుడు నా వద్దకు వచ్చి పెనుకొండ ఎమ్మెల్యే టిక్కెట్ మీకు ఇవ్వాలనుకుంటున్నాం. ఇస్తే పోటీలో ఉంటారా? అని అడిగారు. అప్పటి ఆర్థిక పరిస్థితుల వల్ల సాహసించలేక టిక్కెట్ వద్దన్నా. దీంతో రామచంద్రారెడ్డి పేరును ప్రపోజ్ చేస్తూ, నో అబ్జెక్షన్ అని సంతకం చేశా. దీంతో రామచంద్రారెడ్డికి టిక్కెట్ కేటాయించారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేసి, హెడ్‌మాస్టర్‌గా రిటైర్డ్ అయ్యా.

- చెన్నేకొత్తపల్లి



గోడ రాతలు మాయం

గతంలో ఎన్నికలు వచ్చాయంటే గోడ కనబడితే చాలు ప్రచారానికి వాడేసేవారు. గోడలపై అభ్యర్థుల పేరు, పార్టీ, గుర్తు తదితర వివరాలు బొమ్మలుగా వేసేవారు. పదేళ్ల కిందటి వరకు ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఆయా పార్టీల నాయకులు ఖాళీగా ఉన్న గోడలను రిజర్వు చేసుకునేవారు. పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించడమే ఆలస్యం... వెంటనే ప్రచార రాతలతో గోడలను నింపేవారు. ఎన్నికల సమయంలో వివాహం వంటి శుభకార్యాలు ఉన్నా సరే ఇంటింకి రంగులు వేయించుకునేందుకు యజమానులు వెనుకాడేవారు. కాలక్రమేణ గోడమీద రాతలు మాయమయ్యాయి. సోషల్ మీడియా టెక్నాలజీ విపరీతంగా వినియోగంలోకి రావడంతో మునుపటి ప్రచారం రాతలు కనుమరుగయ్యాయి. దీంతో అప్పటిదాకా గోడమీది రాతలతో ఉపాధి పొందుతున్న కార్మికులకు కూడా పని లేకుండా పోయింది.

- శింగనమల/ముదిగుబ్బ

ఉద్యాన రైతులకు మొండిచేయి..!

- ఐదేళ్ల నుంచి స్టేట్ ప్లాన్ పథకాలు రద్దు
- పలు స్కీంలకు సబ్సిడీ నిధుల మంజూరు నిలిపివేత
- కలెక్షన్ సెంటర్లు, ఫారంపాండ్స్, సోలార్ కోల్డ్ రూంల ఏర్పాటులో నిర్లక్ష్యం

ఉద్యాన పంటలు పండించడంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు దక్షిణాదిలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ పండే అనేక రకాలైన ఉద్యాన పంటలు ఇతర రాష్ట్రాలకే కాదు ఇతర దేశాలకు సైతం ఎగుమతి అవుతుంటాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉద్యాన రైతులకు అనేక రాయితీలు ఉండేవి. జగన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక చాలా పథకాలను రద్దు చేయడంతో రైతులు చేయూత లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



అనంతపురం అర్బన్, ఏప్రిల్ 27 : వైసీపీ ఐదేళ్ల పాలనలో అనంత ఉద్యాన రైతులకు మొండి చేయి చూపింది. తెలుగు దేశం పార్టీ హయాంలో ప్రతి ఏడాది ఉద్యాన రైతులకు పలు రకాల రాయితీలు అందేవి. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యాన రైతులకు రాయితీలు తగ్గిస్తూ వచ్చింది. టీడీపీ హయాంతో పోలిస్తే వైసీపీ పాలనలో 50 శాతానికిపైగా నిధులు తగ్గించారు. దీంతో వేలాది మంది ఉద్యాన రైతులు సబ్సిడీ పథకాలకు దూరమయ్యారు. గత ఐదేళ్లల్లో ప్రతి ఏడాది అరకొరగా విధించిన టార్గెట్లకు సంబంధించి నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో రైతుల నుంచి నిలదీతలను తట్టుకోలేక ఆ శాఖ అధికారులు పలు పథకాలకు రైతుల ఎంపిక చేయలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడారు. వైసీపీ పాలకుల వైఖరితో అనంత ఉద్యాన రైతులకు ఐదేళ్లల్లో తీరని అన్యాయం జరిగింది.

టీడీపీ హయాంలో ఉద్యాన పథకాల అమలు..

సంవత్సరం	పథకాల అమలు (హెక్టార్లల్లో)	నిధుల విడుదల (కోట్లల్లో)
2014- 15	49,624.99	2.97
2015- 16	10,0310.13	9.34
2016- 17	40,964.76	8.24
2017- 18	5,322.58	9.66
2018- 19	5,261.31	10

వైసీపీ పాలనలో ఉద్యాన పథకాల అమలు తీరిదీ...

సంవత్సరం	పథకాల అమలు (హెక్టార్లల్లో)	నిధుల విడుదల (కోట్లల్లో)
2019- 20	2,804.03	4.17
2020- 21	2,062.61	5.25
2021- 22	2,594.05	6.77
2022- 23	4,001.4	3.62
2023- 24	2,209.98	2.94

స్టేట్ ప్లాన్ పథకాలు రద్దు..

ఉద్యాన శాఖలో ఎక్కువ శాతం పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. టీడీపీ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్టేట్ ప్లాన్‌లో పలు రకాల పథకాలను అమలు చేసింది. తద్వారా ఉమ్మడి అనంత జిల్లాకు ఏడాదికి రూ.10 కోట్లకుపైగా నిధులు కేటాయించారు. ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు 75 శాతం రాయితీ వర్తింపజేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే స్టేట్ ప్లాన్ పథకాన్ని పూర్తిగా ఎత్తేశారు. దీంతో ఆయా రైతులు నష్టపోయారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం

గత ఐదేళ్లల్లో ఉద్యాన రైతులకు పలు రకాల పథకాల అమలులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించింది. రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజన (ఆర్‌కేవీవై) పథకం ద్వారా కలెక్షన్ సెంటర్లు, సోలార్ కోల్డ్ రూమ్స్ ఏర్పాటులో తీవ్ర నిర్లక్ష్యం వహించారు. ప్రతి ఏడాది అరకొరగా ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయలేకపోయారు. మరోవైపు ఆర్‌కేవీవై పథకంలో కొత్త పంటల విస్తీర్ణంపెంపుతోపాటు పలు రకాల పంటల రెండో సంవత్సరం నిర్వహణకు లక్ష్యం మేరకు నిధులు విడుదల చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఆయా రైతులు నష్టపోవాల్సి వచ్చింది. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ (ఎంఐడీహెచ్) పథకం ద్వారా మామిడి, జామ, చీనీ, దానిమ్మ, అరటి, బొప్పాయి, ఫ్లవర్ తదితర పంటల విస్తీర్ణంతో పాటు ప్లాస్టిక్ మల్చింగ్, ఫారం పాండ్స్, ప్యాక్ హౌస్, ఉద్యాన యాంత్రీకరణ తదితర వాటికి నిధులు మంజూరు చేయలేదు. పలు పథకాలకు ఎంపిక చేసిన రైతులు తమ వాటా డబ్బులు కట్టేందుకు సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం నుంచి సబ్సిడీ సొమ్ము విడుదలలో జాప్యంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది.

తీరని అన్యాయం

వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యాన రైతులకు ఆశించిన స్థాయిలో పథకాలు వర్తించలేదు. అరకొరగా అందించే సబ్సిడీలు కూడా ఆలస్యం చేసి తీరని అన్యాయం చేశారు. ఉద్యాన శాఖకు బడ్జెట్‌ను పెంచి కరువు జిల్లా ఉద్యాన రైతులకు చేయూతనివ్వాల్సిందిపోయి ప్రతి ఏడాది తగ్గించడం దుర్మార్గం. వైసీపీ పాలనపై ఉద్యాన రైతులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు.



- మల్లికార్జున, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

సబ్సిడీలు భారీగా తగ్గింపు

టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే వైసీపీ పాలనలో ఉద్యాన రైతులకు భారీగా సబ్సిడీలు తగ్గించారు. గత ప్రభుత్వంలో చిన్నసన్నకారు ఉద్యాన రైతులకు ఆశించిన స్థాయిలో సబ్సిడీలు వర్తింపజేసి చేయూతనిచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో ఉద్యాన రైతులకు మొండి చేయి చూపారు. పలు రకాల ఉద్యాన సబ్సిడీలు రద్దు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.



- శివారెడ్డి, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ఇష్టమొచ్చినన్ని రాసేసుకోండి

ఫీల్డ్ అసిస్టెంట్లకు వైసీపీ నాయకుల సూచన



పుట్లూరు, ఏప్రిల్27: 'మన గవర్నమెంట్ ఎలాగూ రాదు. మీకు ఇష్టమొచ్చినన్ని మస్టర్లు రాసేసుకోండి' అంటూ కొందరు వైసీపీ నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్లకు బంపర్ ఆఫర్ ఇస్తున్నారన్న ప్రచారం జోరుగా జరుగుతోంది. ఆమేరకు మండలంలోని పలుగ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు కొందరు ముఖ్యమైన వైసీపీ నాయకులు చెబుతున్నట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వం వచ్చేటట్లు కనిపించడం లేదు బినామీ పేర్లు పెట్టుకొని మీకు ఇష్టమొచ్చినన్ని మస్టర్లు రాసుకొని లబ్ధిపొందండని చెబుతున్నారు. మండలవ్యాప్తంగా సుమారు 18పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మీకు ఏమైనా ఇబ్బంది అయితే టెక్నికల్, సంబంధిత అధికారులు అండగా ఉంటారని హామీ ఇస్తున్నట్లు సమాచారం. దీంతో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లు ఇష్టమొచ్చినట్లు రాస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లు ఉండటం గమనార్హం.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు గడువు పొడిగింపు



అనంతపురం టౌన్, ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగ, ఉపాధ్యాయులకు పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించింది. ఈనెల 26వరకు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉండేది. అయితే వివిధ కారణాలతో పాటు కొంత గందరగోళం నెలకొన్న నేపథ్యంలో చాలామంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోలేక పోయారు. దీంతో పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు గడువును మే1 వరకు పొడిగించినట్లు జిల్లా పోస్టల్‌బ్యాలెట్ విభాగం నోడల్ ఆఫీసర్, డీపీఓ ప్రభాకరరావు తెలిపారు. జిల్లాలో పనిచేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మాత్రమే ఈఅవకాశం ఉంటుందని, ఇతర జిల్లాలలో పనిచేసే వారికి ఉండదని డీపీఓ అన్నారు. జిల్లాలో ఇంకా ఎవరైనా పోస్టల్ బ్యాలెట్‌కు ఫారం-12 దరఖాస్తు చేసుకోకుండా ఉంటే, అలాంటి వారు మే1 వరకు పని చేసే నియోజకవర్గాల ఆర్‌ఓలకు దరఖాస్తు ఫారంలు అందజేయాలని ఆయన తెలిపారు.

గుంతకల్లులో వలసదారులదే హవా!

సత్తా చాటుతున్న పక్క జిల్లా అభ్యర్థులు



గుంతకల్లు, ఏప్రిల్ 27: నియోజవకర్గంలో టీడీపీలో స్థానికుల కంటే పక్క జిల్లా వారిదే హవా నడుస్తూ వస్తోంది. వలస వచ్చి గెలిచినవారిలో అత్యధికులు కర్నూలు జిల్లావారే కావడం గమనార్హం. గుంతకల్లు/గుత్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలైనవారి స్థానికతను ఒకసారి పరిశీలిస్తే విషయం విశదమౌతుంది. టీడీపీ తొలి ఎమ్మెల్యే అయిన పత్తి రాజగోపాల్‌ది కర్నూలు జిల్లా, పత్తికొండ తాలూకాలోని తుగ్గలి గ్రామం. రెండో ఎమ్మెల్యే అయిన ఎన్ గాదిలింగప్పది కర్నూలు జిల్లా ఆలూరు తాలూకాలోని బెల్డోణ గ్రామం. ఈయన కుమార్తె నీలావతి కూడా గుత్తి నియోజకవర్గానికి ఎమ్మెల్యే అయ్యారు. మాజీ ఎమ్మెల్యే దివంగత అరికెరి జగదీశ్ కర్నూలు జిల్లా అరికెరకు చెందినవారు. మాజీ ఎమ్మెల్యే కొట్రికే మధుసూదన్ గుప్తా కూడా కర్నూలు జిల్లా డోన్‌కు చెందినవారు. ప్రస్తుత ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి కూడా ఉరవకొండ నియోజకవర్గంలోని కొనకొండ్లకు చెందినవారు. ఆయన 2003లోనే గుంతకల్లుకు చేరి 2019లో ఎమ్మెల్యేగా గెలిచారు. గుత్తి నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే ఎం రాజారాం కూడా కొనకొండ్లకు చెందినవారే అయినా ఆయన స్థానికుడనే చెప్పాలి. 1955లో ఉరవకొండ తాలూకా గుంతకల్లు నియోజకవర్గంలో ఉండేది. కనుక కొనకొండ్ల గ్రామం గుత్తి నియోజకవర్గంలోనే ఉండటంతో రాజారాంను స్థానికుడిగానే భావించాలి. కాగా వలస వచ్చిన వీరిలో పత్తిరాజగోపాల్, గాదిలింగప్ప, నీలావతి, కొట్రికే మధుసూదన్ తొలి ప్రయత్నంలోనే గెలుపు సాధించగా, ప్రస్తుతం ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి (వైసీపీ), అరికెరి జగదీశ్ (కాంగ్రెస్) రెండో ప్రయత్నంలో గెలుపు సాధించారు. ఈ ఎన్నికల్లో బరిలో టీడీపీ అభ్యర్థిగా పోటీలో నిలిచిన గుమ్మనూరు జయరాం కూడా కర్నూలు జిల్లాకు చెందినవాడు కావడం గమనార్హం. ఇప్పటిదాకా టీడీపీ తరఫున ఎన్నికల బరిలో నిలిచిన కర్నూలు జిల్లా అభ్యర్థులందరూ తొలి యత్నంలోనే గెలుపు సాధించి ఉండటం విశేషం.

ఉపాధి తరువుపై నిర్లక్ష్యం వేటు..!

- జిల్లా కేంద్రంలో కుట్టు శిక్షణ కేంద్రం మూసివేత
- ఉపాధి కోల్పోయిన ఎస్సీ వర్గాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 27: ఎంతో మందికి ఉపాధి కల్పించిన కట్టు శిక్షణ కేంద్రం వైసీపీ పాలనలో మూతపడింది.జిల్లాలో వెనుకబడిన ఎస్సీ వర్గాలకు ఉపాధి, విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ అందించాలనే ఉద్దేశ్యంతో 1986లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అనంతపురంలో కుట్టు శిక్షణ, దుస్తుల ఉత్పత్తి కేంద్రం (ఎన్‌జీపీసీ)ను స్థాపించారు. ఆ కేంద్రంలో మేనేజర్, అసిస్టెంట్ కట్టర్, ఇన్‌స్ట్రక్టర్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్, వర్కర్‌తో పాటు మరో 30 మంది దుస్తులు కుట్టే వారిని నియమించారు. ఆ కేంద్రాన్ని గత ప్రభుత్వా లు దిగ్విజయంగా నడిపాయి. 2018-19లో తెలుగుదేశం ప్రభుత్వం ఒక్కో జత దుస్తులు కుట్టేందుకు ఇదివరకే ఇచ్చే రూ.30లను రూ.80లకు పెంచి అందించింది. దీంతో దుస్తులు కుట్టేవారు రూ. 30 వేలకు పైగానే ఆర్జించా రు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ తొలినాళ్లల్లోనే ఆ కేంద్రా న్ని మూసివేసింది. నా ఎస్సీలు, నా ఎస్టీలంటున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎంతో మంది ఎస్సీ వర్గాలకు ఉపాధినిచ్చిన ఎన్‌జీపీసీని మూతవేయడంపై ఆ వర్గాలు మండిపడుతు న్నాయి.



ఉపాధి పాయె.. విద్యార్థులకు దుస్తులూ పాయె..

ఎన్‌జీపీసీ ద్వారా ఎస్సీ వసతిగృహాల్లో వసతి పొందే విద్యార్థులకు ఏడాదికి నాలుగు జతల చొప్పున ఈ కేంద్రం నుంచే స్కూల్ యూనిఫామ్స్‌ను సరఫరా చేసేవారు. ఇందుకోసం ప్రత్యేకంగా ముగ్గురు టైలర్లను నియమించి ప్రతిరోజూ ఏదో ఒక హాస్టల్‌కు వెళ్లి ప్రతి విద్యార్థి కొలతలు తీసుకునేవారు. ఆమేరకు జిల్లా వ్యాప్తంగా ఎంత మందికి ఎంత వస్త్రం కావాలో ప్రభుత్వా నికి నివేదికలు పంపి, తెప్పించేవారమని ఆ కేంద్రం ఉద్యోగులు పేర్కొంటున్నారు. అప్పట్లో ప్రభుత్వం వస్త్రంతో పాటు ఒక్కో జత మెటీరియల్(దారం, గుండీలు, కుట్టు కూలీ తదితర) ధరలకు అనుగుణంగా రూ. 15లు నుంచి రూ. 30లకు పెంచుకుంటూ వచ్చింది. అనంతరం 2018-19 సంవత్సరంలో ఒకేసారి రూ. 80లకు ఆ ధరలను పెంచింది. దీంతో ఆ కేంద్రంలో దుస్తులు కుట్టే దాదాపు 30 మంది వర్కర్లు దుస్తులను పంపిణీ చేసే సమయానికి ఒకొక్కరు దాదాపు రూ.30 వేల వరకూ ఆదాయాన్ని పొందేవారని పలువు రు ఉద్యోగులు పేర్కొంటున్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కేంద్రాన్ని పట్టించుకోకపోడంతో అందులోని ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. అసిస్టెంట్ కట్టర్, ఇన్‌స్ట్రక్టర్, జూనియర్ అసిస్టెంట్, టైలర్లు, అటెండర్‌లందరూ ఏదో ఒక ప్రభుత్వ శాఖలకు సర్దుబాటు చేయగా మిగిలిన 30 మందికిపైగా వర్కర్లను పట్టించుకోకపోవడంతో వారు ఉపాధిని కోల్పోయారు.

గంగలకుంట చెరువుకు నీరేదీ...?

ఒక ఏడాది సరఫరాతో సరిపెట్టారు
మిగతా నాలుగేళ్లు చుక్కనీరు లేదు
తుస్సుమన్న 'తోపుదుర్తి' ఎన్నికల హామీ

రాప్తాడు, ఏప్రిల్ 27: తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాప్తాడు మండలంలోని గంగలకుంట చెరువుకు ప్రతి ఏడాది నీరు సరఫరా చేస్తామని ప్రస్తుత ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక ఏడాది మాత్రమే నీరు సరఫరా చేసి తర్వాత వదిలేశారు. ప్రస్తుతం గంగలకుంట చెరువు చుక్క నీరు లేక వెలవెలబోతోంది. గత ఎన్నికల సమయంలో ఆర్భాటంగా హామీ ఇచ్చిన ప్రకాష్‌రెడ్డి అరకొరగా అమలు చేసి చేతులు దులుపుకున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. రాప్తాడు పంచాయతీ పరిధిలోని గంగలకుంట గ్రామం అనంతపురం నగరానికి కూత వేటు దూరంలో ఉంది. ఈ గ్రామంలో ఎక్కువగా వ్యవసాయం, పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ గ్రామ చెరువుకు నీరు సరఫరా అయ్యే సౌకర్యాలు చాలా తక్కువ. 2014లో రాప్తాడు ఎమ్మెల్యేగా పరిటాల సునీత గెలుపొందారు. 2014 నుంచి 2019 వరకూ మంత్రిగా కూడా పని చేశారు. ఈ సమయంలో గంగలకుంట చెరువుకు నీరు ఎలాగైనా సరఫరా చేయాలని భావించారు. గొందిరెడ్డిపల్లి సమీపంలో వెళ్లిన పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా గుట్టల్లో నుంచి కాలువ తవ్వి నీరు సరఫరా చేయాలని అప్పటి ఇరిగేషన్ అధికారులతో సర్వే చేయించారు. గుట్టల్లో నుంచి పిల్ల కాలువ తవ్వడం వలన ఆ కాలువ పూడి పోయి నీరు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ఆ మార్గంలో నీరు సరఫరా కష్టమని అధికారులు చెప్పారు. పీఏబీఆర్ కుడి కాలువ నీరు బొమ్మేపర్తి చెరువుకు అక్కడి నుంచి లింగనపల్లి చెరువుకు సరఫరా అవుతాయి. లింగనపల్లి నుంచి రోడ్డు పక్కన పిల్ల కాలువ తవ్వి గంగలకుంట చెరువుకు నీరు సరఫరా చేయాలనుకున్నారు. లింగనపల్లి చెరువు నుంచి జాతీయ రహదారి వరకూ భూములన్నీ వైసీపీ మద్దతుదారులవే ఉన్నాయి. పిల్ల కాలువ తవ్వేందుకు అప్పట్లో ఆ రైతులు నిరాకరించారు. దీంతో నీటి సరఫరా చేయలేకపోయారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పిల్ల కాలువ తవ్వే భూములు వైసీపీ మద్దతుదారు రైతులవే కావడంతో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి అడ్డు చెప్పలేదు. లింగనపల్లి నుంచి జాతీయరహదారి వరకూ రోడ్డు పక్కనే కాలువ తవ్వించారు. జాతీయ రహదారి నుంచి గంగలకుంట చెరువు వరకూ వంక మార్గం ఉండడంతో కాలువ తవ్వకపోయినా వంక మార్గంలో నీరు సరఫరా అవుతాయి. ఒక ఏడాది పీఏబీఆర్ నీటిని గంగలకుంట చెరువుకు సరఫరా చేశారు. ఆ తరువాత నాలుగేళ్లు చెరువుకు నీరు సరఫరా చేయలేదు. ప్రతి ఏడాది చెరువుకు నీరు సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. చెరువులో నీరు లేకపోవడంతో బోర్లలో నీరు చాలా తగ్గాయని రైతుల జీవనాధారం కష్టమవుతోందన్నారు.



ఎండిపోయిన గంగలకుంట చెరువు

బోర్లలో నీరు తగ్గింది: కిష్ట, రైతు, గంగలకుంట



చెరువు సమీపంలో మా పొలం ఉంది. చెరువుకు నీరు సరఫరా కాకపోవడంతో వ్యవసాయ బోర్లలో నీరు తగ్గాయి. ప్రతి ఏడాది చెరువుకు నీరు సరఫరా అయితే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చెరువులో నీరు ఉంటే బోర్లలో భూగర్భజలాలు పెరుగుతాయి. నీటి సమస్య లేకుండా పంటలు సాగుచేసుకోవచ్చు.

వ్యవసాయమే జీవనాధారం

గంగలకుంట గ్రామంలో ఎంతో మంది రైతులు వ్యవసాయం, పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఏటా చెరువుకు నీరు సరఫరా కాకపోవడం వలన రైతులకు జీవనాధారం కష్టమవుతోంది. చెరువులో నీరు సమృద్ధిగా ఉంటే బోర్లలో నీటి మట్టం పెరిగి పంటల సాగు చేసుకోవడానికి ఇబ్బందులు ఉండవు.



- రాజు, రైతు, గంగలకుంట



సోలార్ ప్యానళ్లు

జగనన్నా.. ఇచ్చిన మాట మరిచావా?



పవర్ విద్యుత్ స్తంభం

నంబులపూలకుంట, ఏప్రిల్ 27: ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేస్తూ నంబులపూలకుంట మీదుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సోలార్ హబ్‌కు భూములో కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.రెండులక్షలు మాత్రమే ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.ఐదు లక్షలు ఇస్తామన్నారు. సాగుదారులకు కూడా రూ.లక్ష భిక్ష మిచ్చినట్లు ఇచ్చారని, పట్టాదారు పాసుపుస్తకంతో సమానంగా పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయిన తర్వాత దాని గురించి మరచిపోయారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న రైతులకుల నేటికి పరిహారం అందలేదని వాపోతున్నారు.



కూలి ప్రచారం..!

కూలి పనులు చేస్తూ పొట్టపోసుకునే కూలీలకు 'జెండా పండుగ' వచ్చినట్లుంది. పార్టీ ఏదైనా ఆ పార్టీ తరఫున జెండా పట్టుకుని ప్రచారానికి వెళితే రోజుకు రూ.500 కూలి ఇస్తున్నారు. రోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి రాత్రి వరకు ప్రచారం చేయాల్సి ఉంటుంది. ఏరోజు కూలి ఆ రోజే ఇచ్చేస్తారు. ప్రతి రోజూ ఏ పార్టీ వారు పిలిస్తే ఆ పార్టీ తరఫున ప్రచారానికి వెళ్తారు.

- ధర్మవరం

ఆ దర్పమే వేరు !



కమాండర్ జీప్, అంబాసిడర్ కారుతో వచ్చి ప్రచారం

ఊర్లోకి కమాండర్ జీప్, అంబాసిడర్ కారు వస్తోందంటే ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి వస్తున్నాడని అర్థం. ఆయా వాహనాల్లో వచ్చే వారి దర్పమే వేరుగా ఉండేది. పాత రోజుల్లో ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా ఉపయోగపడిన వాహనాలు కమాండర్ జీప్, అంబాసిడర్ కారు. పోటీ చేసే అభ్యర్థి, పెద్దస్థాయి నాయకులు మాత్రమే వీటిని వాడేవారు. గ్రామానికి వచ్చిన ఆ నాయకులను కొన్ని సందర్భాల్లో గ్రామస్థులు ఓపెన్ టాప్ జీపుల్లో ఊరేగించేవారు. వారు గ్రామంలోని రచ్చబండ వద్దకో లేక గ్రామపెద్ద ఇంటి వద్దకో వెళ్లి వారి మద్దతు కోరేవారు. రానురాను కమాండ్ జీపులు, అంబాసిడర్లు మాయమయ్యాయి. వాటిస్థానంలో హైఎండ్ మోడళ్లతో టాటా సుమోలు, స్కార్పియో వాహనాలు వచ్చాయి. వీటిలో ఉండే ఏసీ సౌకర్యంతో మండే ఎండల్లో ఉపశమనం పొందుతూ అభ్యర్థులు, నాయకులు ప్రచార కార్యక్రమాలకు వెళుతున్నారు. వృద్ధులు, ఓ యాభై ఏళ్ల వయసు దాటి వారికి తప్ప మిగతావారికి అంబాసిడర్ కార్ల గురించి పెద్దగా తెలియదు. తెలుసుకోవాలంటే మాత్రం నెట్‌లో వెతకాల్సిందే.

- కళ్యాణదుర్గం

జన కేతనం

ఆంధ్రజ్యోతి

7

అనంతపురం
శ్రీసత్యసాయి

ఆదివారం 28 ఏప్రిల్ 2024

ఫొటో చూసి ఓటేయవచ్చు



ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు సంస్కరణలకు ప్రాధాన్యం ఇస్తోంది. పారదర్శక పోలింగ్‌కు అవసరమైన మార్పులు, చేర్పులు తీసుకువస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ ఎన్నికల్లో సైతం ప్రత్యేకతలు ఉండనున్నాయి. ప్రజలు ఎవరికి ఓటు వేశామనేది. తెలుసుకునేందుకు వీవీ ప్యాట్‌లు వినియోగించనుండటం, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు చేరుకునేందుకు ప్రత్యేకంగా వాహన సదుపాయం కల్పించడం వంటి సౌకర్యాలతో పాటు అభ్యర్థి ఫొటో చూసి ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తోంది. ఈవీఎంలో అభ్యర్థి పేరు, గుర్తుతో పాటు ఫొటో ఉంటుంది. నోటా వద్ద మాత్రం ఫొటో స్థానం ఖాళీగా ఉంటుంది.

- ఉరవకొండ

టీడీపీకి కలిసి వచ్చిన నెంబర్ 4

రాయదుర్గం, ఏప్రిల్ 27: తెలుగుదేశం పార్టీకి 4 నంబరు బాగా కలిసి వస్తున్నట్లు ఆ పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో రాయదుర్గం నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు మూడుసార్లు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. అందులో 1994లో హులికుంటప్ప, 2004లో మెట్టు గోవిందరెడ్డి, 2014లో కాలవ శ్రీనివాసులు గెలిచారు. ప్రస్తుతం 2024 ఎన్నికలు జరుగుతుండటంతో నంబర్ పరంగా చివర్లో 4 ఉండటంతో తెలుగుదేశం పార్టీ గెలుపు తథ్యమని భావిస్తున్నారు.

మంత్రి పర్యటనకు రాం... రాం..



మడకశిరటౌన్, ఏప్రిల్ 27: ప్రస్తుత ఎన్నికల్లో టిక్కెట్ దక్కని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి వైసీపీ అధిష్ఠానంపై గుర్రుగా ఉన్నారు. ఈక్రమంలోనే పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల ప్రచారాలకు డుమ్మా కొడుతున్నారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం మడకశిరలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటి ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి నాయకులకు దిశానిర్దేశం చేశారు. అయితే ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తిప్పేస్వామి గానీ ఆయన అనుచరవర్గం కానీ ఎక్కడా కనపడలేదు. టిక్కెట్ దక్కకపోవడంతోనే ఎమ్మెల్యే ఇలా తన అసంతృప్తిని వెళ్లగక్కుతున్నాడనే చర్చ నడుస్తోంది.

కూలితేగాని.. పట్టించుకోరేమో..?

శిథిలావస్థలో పాతూరు మున్సిపల్ కాంప్లెక్స్


మూడేళ్లుగా పట్టించుకోని పాలకవర్గం



పాతూరులోని మున్సిపల్ కాంప్లెక్స్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 27: నగరపాలిక పాలకవర్గం బాధ్యతలు చేపట్టి మూడేళ్లు దాటింది. అభివృద్ధి మాట దేవుడెరుగు కొన్ని కార్పొరేషన్‌కు చెందిన భవనాలు శిథిలావస్థకు చేరినా పట్టించుకునే పరిస్థితి లేదు. నగరంలోని పాతూరులోని మున్సిపల్ కాంప్లెక్స్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. రెండేళ్ల కిందట ఓ కాంప్లెక్స్ పై భాగం కుప్పకూలింది. అయినప్పటికీ పాలకుల్లో చలనం రాలేదు. కాంప్లెక్స్ మొత్తం బ్రోకర్ల రాజ్యంగా నడుస్తోం ది. దీంతో నగరపాలిక సంస్థ ఆదాయానికి సైతం గండి పడుతోంది. ఎప్పుడో 30ఏళ్ల క్రితం వేలంలో మున్సిపల్ కాంప్లెక్స్‌లోని దుకాణాలను దక్కించుకున్న వారే ఇప్పటికీ హవా నడుపుతున్నారు. వారు నగరపాలికకు రూ.5వేల నుంచి 15వేల వరకు షాపును బట్టి చెల్లిస్తూ దుకాణ నిర్వాహకులతో రూ.15వేల నుంచి రూ.40వేల వరకు వసూలు చేస్తున్నారు. పాతికేళ్లకోసారి వేలం నిర్వహించి దుకాణాల అద్దె పెంచాల్సి ఉంటుంది. కానీ ఈ పాలకవర్గం అలాంటి చర్యలకు ఉపక్రమించలేదు. పాతూరులో రెండు మున్సిపల్ కాంప్లెక్స్‌లలో మొత్తం 80వరకు దుకాణాలున్నాయి. ఓ భవనంపై ముందు భాగం కూలినప్పటి నుంచి అందులో పై భాగంలో దుకాణం నిర్వహణకు సైతం అనువుగా లేదు. దీనికితోడు ఆ భవనాన్ని కూల్చివేయాలని సంబంధిత అధికారులు నివేదిక ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఆ భవనం ఎప్పుడు కూలుతుందో చెప్పలేని పరిస్థితి. మరో భవనం పరిస్థితి అలాగే ఉంది. మరి వీటికి మోక్షం ఎప్పుడు కలుగుతుందోనని నగర ప్రజలు ఎదురు చూస్తున్నారు.

అన్నదాతకు మొండిచేయి




2023 ఖరీఫ్, రబీ ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమాకు ఎగనామం

కరువు రైతుకు పరిహారమేదీ జగన్..?

సీఎం తీరుపై రైతుల ఆగ్రహం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 27 : వర్షాభావం, అకాల వర్షాలతో పంటనష్టపోయిన కరువు రైతులను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి విఫలమయ్యారు. వైసీపీ పాలనలో జిల్లాలోని 95,320 మంది రైతులకు రూ.113.66 కోట్లు పంట నష్టపరిహారం విడుదల చేయడంతో సరిపెట్టారు. మరోవైపు 2023-24 సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో వర్షాభావంతో రైతులు పూర్తిగా నష్టపోయారు. బాధిత రైతులకు పంటనష్టపరిహారం, ఉచిత పంటల బీమాను అందజేయలేదు. ఎన్నికల కోడ్‌కు ముందు ఈ ఏడాది మార్చి 6న 2023-24 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని 28 మండలాల్లో 1.69 లక్షల మంది రైతులకు సంబంధించి 1.79 లక్షల హెక్టార్లల్లో రూ.251.2 కోట్ల పంటనష్టపరిహారాన్ని తాడేపల్లి క్యాంపు ఆఫీస్ నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. ఇప్పటి దాకా ఏ ఒక్క రైతుకు ఇన్‌పుట్ సబ్సిడీ జమ కాలేదు. ఎన్నికల సమయంలో రైతులను మభ్యపెట్టేందుకే బటన్ నొక్కారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీఎం జగన్ తీరుపై కరువు రైతులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పంటనష్టపోయిన తమకు పరిహారం ఇవ్వలేని సీఎం ఇంకేం న్యాయం చేస్తారంటూ నిలదీస్తున్నారు.



పంట నష్టపరిహారం, పంటల బీమా అనేవి ఒకప్పుడు రైతులకు ఎంతో ఊరటనిచ్చేవి. పంట నష్టపోయిన రైతులకు వచ్చే సొమ్ముతో తర్వాత సీజన్‌లో పెట్టుబడులకు ఉపయోగపడేవి. జగన్‌రెడ్డి వచ్చాక 'రైతుభరోసా'లోనే అన్నీ కలిపేస్తున్నారు. ఇచ్చే అరకొర కూడా మూడు దఫాలుగా అకౌంట్లలోకి వేస్తుండడంతో పెట్టుబడులకు కాదు కదా కనీసం రెండు బస్తాల ఎరువులు కూడా కొనలేని పరిస్థితి. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు పంట నష్టపరిహారం, పంటల బీమా విడుదల చేస్తున్నామని సీఎం బటన్ నొక్కారు. ఇంత వరకూ ఒక్కరైతుకూ ఒక్క రూపాయి కూడా జమ కాలేదు.

ఇన్‌పుట్ సబ్సిడీనే ఇవ్వలేదు.. రైతులకు ఇంకేం చేస్తాడు



వైసీపీ పాలనలో పంటనష్టపోయిన రైతులకు సక్రమంగా ఇన్‌పుట్ సబ్సిడీనే ఇవ్వలేదు. రైతులకు ఇంకేం న్యాయం చేస్తాడు. 2023 ఖరీఫ్‌లో ఆరు ఎకరాల్లో కంది పంట సాగు చేశా. వర్షాభావంతో పంట దిగుబడి రాలేదు. ఇన్‌పుట్ సబ్సిడీ జాబితాలో పేరున్నా ఇప్పటి దాకా పరిహారం ఇవ్వలేదు. రైతును రాజును చేస్తామని చెప్పడం తప్పా చేసిందేమీ లేదు. ఈ సారి రైతులకు ఎవరు ఆండగా నిలబడి ఆదుకుంటారో అలాంటి పార్టీకే మద్దతునిస్తాం.

- రైతు వెంకటనారాయణరెడ్డి, నగరూరు, యాడికి మండలం

రైతులను నట్టేట ముంచాడు

ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి కరువు రైతులను నట్టేట ముంచాడు. అధికారంలోకి రాగానే రైతులకు అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చి మాట తప్పాడు. వైసీపీ పాలనలో అరకొరగానే ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ సొమ్ము అందించి చేతులు దులుపుకున్నారు. 2023 సంవత్సరంలో మరీ దారణం. ఖరీఫ్, రబీ రెండు సీజన్లల్లో వర్షాభావంతో పంటలన్నీ దెబ్బతిని రైతులు నష్టపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కనీసం రైతులను పలుకరించి ఓదార్చే తీరిక ప్రజాప్రతినిధులకు లేకపోవడం రైతులపై వైసీపీ ప్రజాప్రతినిధులకు ఏపాటి చిత్తశుద్ధి ఉందో చెబుతుంది.



- పవన్‌కుమార్, ఆర్.కొట్టాల, విడపనకల్లు మండలం

రైతులకు న్యాయం చేసే పార్టీకే ఓటు



ముఖ్యమంత్రి జగన్ రైతులకు అన్యాయం చేశాడు. గత ఎన్నికల్లో ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే ఆ సీజన్ ముగిసేలోపే పరిహారం, ఇన్సూరెన్స్ అందించి ఆదుకుంటామని ఆర్భాటంగా ప్రకటించాడు. జిల్లాలోని వేరుశనగ, కంది, ఆముదం, మిరప,పప్పుశనగ, ఇతర రకాల పంటలు సాగు దిగుబడులు రాకపోవడంతో రైతులు భారీగా నష్టపోయారు. పంట నష్టపరిహారం ఇవ్వకపోవడంతో రైతులు అప్పులపాలవుతున్నారు. ఈసారి ఎన్నికల్లో రైతులకు న్యాయం చేసే పార్టీకే ఓటు వేస్తాం.

- శ్రీనివాస్ చౌదరి, రైతు, ధర్మాపురం, గుత్తి మండలం

దండేస్తే... దాడిచేస్తారా?



గాయపడిన అయూబ్‌ఖాన్

ఏందన్నా ఈ పని ? అందరూ ఒక ఊరి వారే కదా.! తెల్లారి లేస్తే ఒకరి మొఖాలు ఒకరు చూసుకోవాలా. ఒకరికి కష్టమొస్తే మరొకరు ఆదుకోవల్ల. అట్లాంటిది. ఎవరో రాజకీయ నాయకుల కోసం, పార్టీల కోసం గొడవ పడతారా? ఎవరి అభిమానం వారిది. ఎవరి ఇష్టం వారిది. అందరూ మీకు నచ్చినట్లు ఉండాలా? అట్లుండకపోతే దాడి చేస్తారా? ఇలాంటి సంఘటనే కొత్తచెరువు మండలం బండ్లపల్లిలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన అయూబ్ ఖాన్, తన కుమారైతో కలిసి బండ్లపల్లి, భైరాపురం పంచాయతీలలో ప్రచారానికి వచ్చిన టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డికి పూలమాల వేశారు. ఇదే నేరమైనట్లుగా గ్రామానికే చెందిన వైసీపీ నాయకులు మున్వర్ బాషా, షౌకత్ వలీ, కురుబ మనోహర్, అక్బర్‌వలీ ఆయనపై దాడికి పాల్పడ్డారు. దుర్భాషలాడుతూ చెప్పు కాళ్లతో విచక్షణా రహితంగా తన్నారని బాధితుడు పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి దాడిచేసిన వారిపై ఫిర్యాదు చేశానన్నారు. టీడీపీ కార్యకర్తలపై వరుస దాడులు జరుగుతున్న పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తున్నారన్న విమర్శలు ప్రతిపక్షాల నుంచి వ్యక్తమవుతున్నాయి.

- కొత్తచెరువు

అన్నో..! రోంత జాగర్త

బీకే పార్థసారథి కారుకు ప్రమాదం



దెబ్బతిన్న వాహనం

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 27: అన్నా..! ఎన్నికల ప్రచారంలో మీరంతా బిజీ బిజీగా ఉన్నారు. పోలింగ్ తేదీ దగ్గర పడే కొద్దీ మండుతున్న ఎండను సైతం పట్టించుకోకుండా గ్రామాలను చుట్టేస్తూ తమకే ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు. అయితే ప్రయాణ హడావుడిలో రోంత జాగర్తగా ఉండండి. మీరంతా సమాజానికి కావాల్సినవారు. ప్రమాదవశాత్తు అనుకోని దుర్ఘటన జరిగితే అది మీమీ కుటుంబాలకే కాదు సామాన్య ప్రజలకు కూడా నష్టమే. శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హిందూపురం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి త్రుటిలో బయటపడటమే ఇందుకు ఓ ఉదాహరణ. ముందు వెళుతున్న ఐచర్ వాహనం డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో బీకే ప్రయాణిస్తున్న ఫార్చ్యూనర్ వాహనం దాన్ని ఢీకొట్టింది. ఫార్చ్యూనర్ ముందుభాగం దెబ్బతింది. బీకే ఎలాంటి గాయాలు లేకుండా క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతపురం నుంచి శనివారం ఉదయం ఆయన రెండు వాహనాల్లో ఎన్నికల ప్రచారం నిమిత్తం మడకశిరకు బయలు దేరారు. చెన్నేకొత్తపల్లి మండలం ఎర్రంపల్లి పెట్రోల్‌బంక్ వద్దకు వెళ్లగానే ప్రమాదం జరిగింది. దీంతో బీకే మరో వాహనంలో మడకశిరకు వెళ్లారు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఐచర్ వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

మంత్రి ప్రసంగిస్తుండగానే జారుకున్న జనం

తలుపులు వేయడానికి ప్రయత్నించిన కార్యకర్తలు

కల్యాణమండపం వద్ద కొట్టుకున్న వైనం



ఇలా కొట్టుకుంటున్నారు..

హిందూపురం, ఏప్రిల్ 27: హిందూపురం పట్టణంలోని ఓ కల్యాణమండపంలో శనివారం వాల్మీకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జిల్లా నలమూలల నుంచి కులస్థులు వచ్చారు. సాయంత్రం జరిగిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైసీపీ ఎంపీ అభ్యర్థి శాంతమ్మ మాట్లాడారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి ప్రసంగం ప్రారంభించారు. ఆయన ప్రసంగం ప్రారంభం కాగానే జనం ఒక్కొక్కరిగా వెళ్లిపోతుండగా అక్కడే ఉన్న వైసీపీ నాయకులు అడ్డుకోబోయారు. తలుపులు వేయడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా తాము వెళ్తుంటే ఎందుకు తలుపులు వేస్తున్నారని జనం ప్రశ్నించారు. అంతటితో ఆగక ఒకరితో ఒకరు పిడిగుద్దులతో కొట్టుకుంటుండగా చూసిన వైసీపీ నాయకుడు రమేష్ అడ్డుకోబోయాడు. శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించాలని వైసీపీ ఎంపీ అభ్యర్థి నిర్ణయించుకున్నారు. మొదట 5 వేల మంది వాల్మీకులు వస్తారని వాల్మీకి కల్యాణమండపాన్ని ఎంపిక చేశారు. జనం తక్కువ వస్తారని భావించి ఆర్‌ఎంఎస్ ఫంక్షన్ హాల్‌కు మార్చారు. వాల్మీకులకంటే ఇతర కులాల వారే ఎక్కువ సంఖ్యలో వచ్చారని అక్కడికి వచ్చిన వాల్మీకులే చెప్పారు. పార్టీలకు అతీతంగా ఆత్మీయ సమావేశానికి వచ్చారే తప్పా వచ్చిన వారందరూ వైసీపీకి అనుకూలం కాదని వాల్మీకులే పేర్కొనడం విశేషం. మంత్రి ప్రసంగం ప్రారంభం కాగానే వెళ్లి పోవడానికి వెనక అధికార పార్టీకి చెందిన ఒక వర్గం ఉందని మరో వర్గం నాయకులు పేర్కొంటున్నారు.



సర్ది చెబుతున్న నాయకుడు

వాల్మీకి నాయకులు ఎక్కడ..?

వైసీపీ ఎంపీ అభ్యర్థి ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకుల ఆత్మీయ సమావేశంలో హిందూపురం వాల్మీకి కులానికి చెందిన నాయకులు కనిపించలేదు. వేలాదిగా వస్తారని భావించారు. కానీ వందల్లో వచ్చారని తెలుస్తోంది. మరీ ముఖ్యంగా స్థానికంగా ఉన్న నాయకులే రాకపోవడం చర్చనీయాంశమైంది. జిల్లా వ్యాప్తంగా అధిక శాతం వాల్మీకులు టీడీపీ వైపే ఉన్నారు. ఆత్మీయ సమావేశమని చెప్పినా వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించడంతో అక్కడికి పోలేదని తెలిసింది. వైసీపీలో ఉంటూ వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ అయి ఉండి కూడా పొగాకు రామచంద్ర ఈ సమావేశానికి డుమ్మా కొట్టడం వెనక అంతర్యం ఏమిటో అధికార పార్టీ నాయకులకే తెలియాలి. మంత్రి పెద్దిరెడ్డికి సన్నిహితంగా మెలుగుతున్న ఆయనే రాకుండా ఉండటం చర్చకు తావిచ్చింది.

నరకానికి నకళ్లు

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఇబ్బందిపడుతున్న గ్రామాల ప్రజలు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 27: గ్రామీణ రహదారులు నరకానికి నకళ్లుగా మారాయి. ఆరోడ్లపై ప్రయాణం చేయాలంటే ప్రజలు వణికే పరిస్థితి. మండలంలోని వసంతపురం గ్రామానికి వెళ్లే రహదారి కంకర తేలి ప్రయాణానికి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ధర్మవరం వెళ్లే ప్రధాన రహదారి నుంచి గ్రామానికి వెళ్లే రహదారి రెండు కిలోమీటర్లు ఆధ్వానంగా ఉందని ఆటోలు, ద్విచక్రవాహనాలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు వారు పేర్కొంటున్నా రు. తుమ్మల, తిప్పేపల్లి, సుబ్బరావుపేట గ్రామాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డంతా గుంతలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాంపురం నుంచి ధర్మవరం వెళ్లే ప్రధాన రహదారి కంకర తేలి గుంతలు ఏర్పడి ప్రయాణానికి అసౌకర్యంగా మారింది. ముచ్చురామి గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డంతా గుంతలతో అధ్వానంగా మారింది. గుంతలు పడ్డ రహదారులను ఎప్పటికప్పుడు గమనించి మరమ్మతులు చేయించాల్సిన అధికారులు, పాలకులు వాటి పట్ల కనీస ఆలోచన చేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గుంతలు పడి అధ్వానంగా ఉన్న రాంపురం నుంచి ధర్మవరం వెళ్లే రహదారి




వసంతపురం వెళ్లే రహదారిలో కంకరతేలి అధ్వానంగా ఉన్న దృశ్యం

బీదల పాట్లు

చిలమత్తూరు, ఏప్రిల్ 27: మండలంలోని కోడూరు, చిలమత్తూరు పంచాయతీలోని పేద ప్రజలకు సొంతిళ్లు కలగానే మిగిలిపోయింది. తమ పాలనలో పేదలందరికీ ఇంటి స్థలాలు, గృహాలు ఇచ్చామని ఊదరగొడు తున్న వైసీపీ ప్రచారానికి విరుద్ధంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఉన్నాయి. కోడూరు, చిలమత్తూరు పంచాయతీలోని గ్రామలకు సంబంధించి కోడూరు పంచాయతీలోనే లేఅవుట్లు వేయడానికి అధికారులు తొలుత సిద్ధమయ్యారు. ఆ మేరకు మర్రో తోపులో ప్రభుత్వ భూమిని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేశారు. భూమి చదును చేసే పనులు పూర్తి చేశారు. అయితే ఆ భూమి మర్రోతోపునకు సంబంధించిందని, అందులో లేఅవుట్ నిర్మాణాలు చేపట్టరాదని ఉన్నతాధికారులు ఆదేశించడంతో స్థానిక అధికారులు విరమించుకున్నారు. అక్కడ భూ అభివృద్ధి పనులకు రూ. 2 లక్షల వరకు ఖర్చు చేశారు.

అనాలోచిత నిర్ణయాలతో ఆటంకాలు



ఆగిపోయిన ప్రభుత్వ లేఅవుట్

మర్రో తోపులో లేఅవుట్ కథ ముగిసిన అనంతరం అధికారులు కర్ణాటక సరిహద్దులోని సర్వే 871-4 నంబర్‌లో మూడెకరాలను గుర్తించి లేఅవుట్ నిర్మాణాన్ని ప్రారంభించి రూ.6 లక్షల వరకు ఖర్చు చేశారు. చివరికి ఆ భూమి ఎక్కువ విలువైందని గ్రహించిన ఉన్నతాధికారులు లేఅవుట్‌ని రద్దు చేసుకొన్నారు. మరోసారి కొడికొండ చెక్‌పోస్టు కేంద్రంలోని ఏపీ టూరిజం రెస్టారెంట్ వద్ద ఉన్న సర్వేనంబర్ 774-2, 774-3, 775-3లో ఏడు ఎకరాలను లేఅవుట్‌గా మార్చేందుకు అధికారులు సిద్ధపడ్డారు. కానీ ఆ భూమి కూడా విలువైనదని గ్రహించిన అధికారులు మరో లేఅవుట్ కోసం అన్వేషించారు. చివరికి కోడూరు వద్ద ఉన్న సర్వేనంబర్ 411-1,3,4,7,8 లోని 6.78 ఎకరాలన సిద్ధం చేశారు. ఏ మాత్రం ఆలోచించకుండా పనులు ప్రారంభించి రూ. ఏడు లక్షల వరకు ఖర్చు చేశారు. అంతలోనే ఆ భూమి తనదని, అధికారులు దౌర్జన్యంగా లేఅవుట్ వేశారంటు యజమాని కోర్టును ఆశ్రయించాడు. దీంతో ఆ లేఅవుట్‌లో ఇంటి స్థలాల మంజూరు ఆగిపోయింది. ఈక్రమంలోనే కోడూరు పంచాయతీలోని 170 మందితో పాటు చిలమత్తూరుకి చెందిన మరో 100 మందికి ఇళ్ల స్థలాలు అందకుండాపోయాయి. ప్రభుత్వ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ ధనం వృథా అవడమే కాకుండా పేద ప్రజలు సొంతింటి కలకు దూరమయ్యారనే విమర్శలు వినవస్తున్నాయి.

దగ్గుబాటి వినూత్న ప్రచారం

కళాశాల మైదానం, టీ కేఫ్, టిఫిన్ సెంటర్లలో ఓట్ల అభ్యర్థన





జూనియర్ కాలేజీ మైదానంలో వాకర్స్‌తో మాట్లాడుతున్న దగ్గుబాటి ప్రసాద్ , పాస్టర్ల ఆత్మీయ సమావేశానికి హాజరైన దగ్గుబాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 27: అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ వినూత్నంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం నగరంలోని న్యూటౌన్ జూనియర్ కళాశాల, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల మైదానాల్లో వాకర్స్, క్రీడాకారులను ఆయన కలిశారు. అలాగే కోర్టు రోడ్డు, ఆదిమూర్తి నగర్‌లోని పలు టీ కేఫ్, టిఫెన్ సెంటర్లల్లో ప్రచారం చేశారు. 'నేను మీలో ఒక్కడిలా వచ్చాను.. మీ వాడిగా మీతో ఉంటాను... ప్రతి అంశాన్ని రాజకీయంతో ముడిపెట్టలేము.. ఒక సామాన్యుడిగా మీ వద్దకు వచ్చాను..' అని దగ్గుబాటి వారితో అన్నారు. అలాగే శనివారం సాయంత్రం టవర్‌క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ ఆయన ప్రచారం నిర్వహించారు.

క్రిస్టియన్ల ఆత్మీయ కలయిక

స్థానిక రాంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ ఆధ్వర్యంలో క్రిస్టియన్ల ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. క్రిస్టియన్లకు జగన్‌రెడ్డి తీరని అన్యాయం చేశారని దగ్గుబాటి ప్రసాద్ మండిపడ్డారు. టీడీపీ గెలుపు కోసం పాస్టర్స్ అందరూ సహకరించి, ఎన్డీయే కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు అంకే ఈశ్వరయ్య, పాస్టర్ బిషప్ శామ్యూల్ శ్రీనివాస్, పాస్టర్ కృపాదాస్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల ప్రచారం

నగరంలోని రహమత్ నగర్, బాబానగర్, ఆర్‌కే నగర్‌ల్లో మాజీ మేయర్ స్వరూప, మాజీ కార్పొరేటర్ రహమత్‌బీ లతో కలిసి దగ్గుబాటి శ్రీ లక్ష్మీ ఎన్నికల ప్రచారం చేశారు. 40 వ డివిజన్‌లోని ఆజాద్ నగర్‌లో రాయల్ మధుతో కలిసి దగ్గుబాటి సోదరుడు ప్రతాప్, 39వ డివిజన్‌లో దగ్గుబాటి ప్రసాద్ సోదరుడి జగన్ భార్య సాయిలీల, టీడీపీ బెస్త సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు చేపల హరి, ఇతర నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. అలాగే బుడ్డప్పనగర్‌లో ఎంపీ అభ్యర్థి సతీమణి శ్యామలదేవి, మాజీ కార్పొరేటర్ రాధాదేవిలతో కలిసి మాజీ మేయర్ స్వరూప ప్రచారం చేశారు. దగ్గుబాటి సోదరుడు దగ్గుబాటి జగన్ అనంతపురంరూరల్ మండలంలోని ఏ.నారాయణపురం, పోతులయ్య కొట్టాల, భువనేశ్వర్ నగర్ ప్రాంతాల్లో ఆయన స్థానిక క్లస్టర్ ఇన్‌చార్జ్ డిష్‌నాగరాజు ఇతర నాయకులతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

నగరంలో నాయకుల విస్తృత ప్రచారం

అనంతపురం న గరంలోని పలు డివిజన్లల్లో శనివారం స్థానిక నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం చేశారు. 20వ డివిజన్‌లో టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎం లక్ష్మీప్రసాద్, 42వ డివిజన్‌లో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, 13వ డివిజన్‌లో గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షి, టీడీపీ కురబ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ కురబ నారాయణస్వామి, 28వ డివిజన్‌లో టీడీపీ ఎస్టీ సెల్ నగర అధ్యక్షుడు మనోహర్‌లు ప్రచారం చేశారు. దగ్గుబాటి ప్రసాద్‌కు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. 27వ డివిజన్‌లో జనసేన రాష్ట్ర నాయకులు భవానీ రవికుమార్ దగ్గుబాటి ప్రసాద్‌కు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి శివ, బండి లక్ష్మన్న, నాగ సురేష్, జ్యోతి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణపురం ఎస్సీ కాలనీ ప్రచారంలో పాల్గొన్న దగ్గుపాటి జగన్

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు

టీడీపీ కూటమి అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ

గార్లదిన్నె, ఏప్రిల్ 27 : నారా చంద్రబాబునాయుడితోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు. శనివారం గార్లదిన్నె, పెనకచెర్ల, కొత్తపల్లి గ్రామాల్లో ద్విసభ్య కమిటి సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, సోదరి కిన్నెరలో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలను దోచుకుంటున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గుర్రం ఆదినారాయణ, గేటుక్రిష్టారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరాజు, ఇల్లూరు రామాంజి, గుత్తాబాలకృష్ణ, నరసింహారెడ్డి, చితంబరప్ప, జయరాం, సుంకన్న, రామచంద్ర, గుర్రంశీనా, వడ్లరాము, బాబయ్య, అంజి, చిరుత క్రిష్టారెడ్డి, గోరకాటి వెంకటేసు, రామకృష్ణ, గుత్తాహరి, సామల మధు, చల్లారాజు, కొడిదల శీనా, చలపతి, నలపరెడ్డి పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ప్రచారం

నార్పల : నార్పల మండలంలోని నడిమిదొడ్డి గ్రామంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిట్టురంగారెడ్డి, ఆకుల నాగార్జున నాయుడు, చంద్రబాబు, లక్ష్మీనాయుడు, తిప్పన్న, జాఫర్, రాజన్న, పీఎల్ లక్ష్మీనారాయణ, తలారి కుళ్లాయప్ప, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

శింగనమల : తరిమెలలో కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు బండారు శ్రావణిశ్రీ, అంబికా లక్ష్మినారాయణ తరఫున టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడి, విజయ్‌కుమార్, సంజావ రాయుడు, నారాయణస్వామి. ఖాదర్‌వలి, చిరంజీవి పాల్గొన్నారు.



పెనకచెర్లలో ప్రచారం చేస్తున్న బండారు శ్రావణి శ్రీ





పార్టీలోకి చేరిన వారితో మాజీ మంత్రి పరిటాల సునీత, ఉప్పరవాండ్లకొట్టాలలో మహిళలతో కలిసి నిర్వహిస్తున్న ప్రచారం

టీడీపీలోకి వలసలతో 'తోపు' వణుకు

కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 27: నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి పెద్ద ఎత్తున వలసల పరంపర కొనసాగుతుండటం.. తోపు బ్రదర్స్ వెన్నులో వణుకు పుట్టిస్తోందని కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత పేర్కొన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని ఉప్పరవాండ్లకొట్టాల, బసినేపల్లి, నాగసముద్రం గ్రామాల్లో ఆమె పర్యటించారు. టీడీపీలోకి చాలా మంది చేరుతుంటే దానిని జీర్ణించుకోలేక ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, ఆయన సోదరులు దాడులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎక్కడా అభివృద్ధి కనిపించలేదని, ఈ ఎమ్మెల్యే ఒక్కసారి కూడా గ్రామాలవైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదన్నారు. ప్రచారంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేశు, నాయకులు పాల్గొన్నారు.

ఆగని టీడీపీలోకి వలసలు..

అనంతపురంరూరల్ : రాప్తాడు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో అనంతపురంలో క్యాంప్ కార్యాలయంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కనగానపల్లి మండలం కోనాపురం, చెన్నేకొత్తపల్లి, కనుముక్కల గ్రామం, ముష్టికోవెల, ఆత్మకూరు, రాప్తాడు, కనగానపల్లి, అనంతపురం రూరల్ ఆకుతోటపల్లి తదితరులు గ్రామాలకు చెందిన వారు టీడీపీలో చేరారు.

కుటుంబ సభ్యుల ప్రచారం

అనంతపురంరూరల్ మండలంలోని ఆకుతోటపల్లి గ్రామంలో పరిటాల కుటుంబ సభ్యుల ప్రచారం నిర్వహించారు. పరిటాల రవీంద్ర సోదరి ఉష, చిన్న కోడలు తేజస్వి, ధర్మవరపు రవిశ్రేణిలు గ్రామంలోని టీడీపీ నాయకులతో కలసి ఇంటింటా ప్రచారం చేపట్టారు.

మరూరులో టీడీపీ ప్రచారం

రాప్తాడు : మండలంలోని మరూరులో మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మరూరు గోపాల్, నారాయణస్వామి, కదరయ్య, కేశవ, మేనక తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రచారంలో దేవదాయ శాఖ ఉద్యోగి

నార్పల, ఏప్రిల్ 27 : మండలంలోని గూగూడు గ్రామంలో వైసీపీ శింగనమల నియోజకవర్గ అభ్యర్థి వీరాంజనేయులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో గూగూడు దేవాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి పల్లెరాజేష్, వలంటీర్ నాగభూషణం డప్పులు వాయిస్తూ పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న వలంటీర్, స్వీపర్

ధర్మవరంరూరల్ : కనగానపల్లిలో ఈనెల 18వ తేదిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆ ప్రచారంలో ఆ గ్రామానికి చెందిన వలంటీర్ సాకే పోతలయ్య, కేజీబీవీ పాఠశాల స్వీపర్ బీరమ్మ పాల్గొని ఎమ్మెల్యే వెంట తిరిగారు. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.



నార్పల ప్రచారంలో పల్లె రాజేష్, నాగభూషణం కనగానపల్లిలో వలంటీర్ సాకే పోతలయ్య, కేజీబీవీ పాఠశాల స్వీపర్ బీరమ్మ

భళా.. నాగ వెంకట్..!

- 2 ఏళ్లా 4 నెలలకు బాల మేధావిగా గుర్తింపు
- చిటికెలో శ్లోకాలు, దేశాల పేర్లు చెప్పేస్తున్న వైనం
- ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి ప్రశంస



అనంతపురం విద్య, ఏప్రిల్ 27 : మీరు చూస్తున్న ఈ బుడ్డోడి మేధస్సులో చిచ్చర పిడుగు. పేరు నాగ వెంకట అభిరామ్ కొప్పారపు. చిటికెలో శ్లోకాలు చెప్పేస్తాడు. అనర్గళంగా దేశాల పేర్లు, వాటి రాజధానులు వల్లెవేస్తాడు. ఇలాంటి అసాధారణ ప్రతిభావంత బాలుడి వయస్సు 2 ఏళ్లా 4 నెలలు. తల్లిదండ్రులు జయలక్ష్మి, సాయి శంకర్ దంపతులది విజయవాడ. బాలుడి మేధస్సు గురించి విన్న ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ఇటీవల బాలుడి మేధస్సును ఆన్‌లైన్‌లో ఇటీవల పరీక్షించారు. పలు రకాల కూరగాయలు, పండు, కలర్స్, శరీర అవయవాలు, పరిసరాలు, నంబర్లు గుక్కతిప్పకుండా చెప్పడంతోపాటు, శ్లోకాలు, దేశాలు, వాటి రాజధానులు, వాహనాలు పేర్లు చకచకా చెప్పేయడంతో వాళ్లు ప్రత్యేకంగా అభినందించారు. బాలుడి మేధస్సును పరిశీలించిన ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ వాళ్లు... శుక్రవారం నాగ వెంకట అభిరామ్‌ను సూపర్ టాలెంటెడ్ కిడ్‌గా గుర్తిస్తూ... ప్రశంసాపత్రం, మెడల్ అందజేశారు.

భక్తిశ్రద్ధలతో గోవింద భజనలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 27: గోవింద సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటా గోవింద భజనలు కార్యక్రమంలో శనివారం మూడో రోడ్డులోని బొగ్గరపు కొనప్పశెట్టి నివాసంలో 150వ వారం భజనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు సామూహికంగా గోవింద నామావళి పఠిస్తూ, భక్తిగీతాలాపనలు చేస్తూ భజనలు చేశారు. కార్యక్రమంలో గోవింద సేవా సంఘం అధ్యక్షుడు రమణ, భూపాలం రవి, ఆదినారాయణ, కలవల మల్లికార్జున, రాజా, రాఘవేంద్ర, గూడూరు రాజేష్, వెంకటస్వామి పాల్గొన్నారు.



భజనలు చేస్తున్న భక్తబృందం

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

నార్పల, ఏప్రిల్ 27: స్థానిక ఆర్డీటీ సమీపంలో శనివారం ద్విచక్రవాహనం బోల్తా పడిన సంఘటనలో ఓ చిన్నారి అక్కడికక్కడే మరణించింది. నడిమిదొడ్డి గ్రామానికి చెందిన నాగార్జున తన కుమార్తె ఝాన్సీ (8) తో కలసి నసనకోటలో జరిగే గురుకుల ప్రవేశ పరీక్షకు బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో సడన్‌గా కుక్క రావడంతో దాన్ని తప్పించబోయిన బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఝాన్సీ అక్కడికక్కడే మరణించింది. తీవ్రంగా గాయపడ్డ నాగార్జునను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసా నాయుడు బాధిత కుటుంబ సభ్యులను పరామార్శించారు. రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

సజావుగా పాలిసెట్ పరీక్ష

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 27: జిల్లా వ్యాప్తంగా పాలిసెట్ పరీక్ష శనివారం సజావుగా సాగినట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. అనంతపురం, కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు పట్టణాల్లో మొత్తం 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 8,898 మంది విద్యార్థులకుగాను 1081 మంది గైర్హాజరయ్యారని, దీంతో హాజరుశాతం 87.85గా నమోదు అయిందని తెలిపారు.

మణికంఠకు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మణికంఠ

అనంతపురం కల్చరల్ : అనంతపురం నగరానికి చెందిన బుట్నా మణికంఠ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. సమాజాభివృద్ధి కోసం రూపొందించిన సాంకేతిక పరివర్తనపై, ఎథికల్ హ్యాకింగ్ కేర్ ద్వారా ఎంతో మందికి బుట్నా మణికంఠ శిక్షణ ఇచ్చారు. ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు అధునాతన శిక్షణ ఇచ్చారు. ప్రజలు, పోలీసుల మధ్య సమన్వయాన్ని ఏర్పాటు చేసేలా యాప్‌ను రూపొందించారు. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనుబంధ సంస్థ అయిన హెచ్‌డీఏసీ ఆఫ్ ఇండియా సంస్థ మణికంఠను డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. శనివారం ఢిల్లీలోని ఆ సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బుట్నా మణికంఠకు డాక్టరేట్‌ను అందజేశారు.

ఐచర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

గార్లదిన్నె, ఏప్రిల్ 27: మండలంలోని తలగాసిపల్లె క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఐచర్ వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. కర్ణాటక హోసకోట పండ్లు, కూరగాయాలు లోడుతో కర్నూల్‌లోని రిలియాన్ మార్టుకు వెళ్తున్న ఐచర్ టెంపో వాహనాన్ని... అనంతపురం నుంచి కర్నూల్‌కు వెళ్తున్న నందికొట్కూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక వైపు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ సుబ్బరాయుడు తీవ్రంగా, మరో ముగ్గురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వం తరలించారు. ఆ బస్సు ప్రయాణికులను మరో బస్సు ద్వారా వారి గమ్య స్థానాలకు పోలీసులు పంపారు. కేసు దర్యాప్తులో ఉంది.

లింగనిర్ధారణ చట్టవిరుద్ధం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 27: లింగ నిర్ధారణ, అబార్షన్ చేయడం చట్టవిరుద్ధమని, అలాంటి వాటికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి హెచ్చరించారు. శనివారం జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.అనేక చర్యలు తీసుకుంటున్న ఇంకా జిల్లాలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, అందుకు కారకులైన వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఆ ఆస్పత్రులను సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఎంఓ డాక్టర్ ఓబులు, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు బానుజా, విజయ్‌కుమార్, డెమోలు ఉమాపతి, త్యాగరాజు, గంగాదర్ పాల్గొన్నారు.

పరిశీలకుల 'ఆట'విడుపు

అనంతపురం క్లాక్‌టవర్ : ఎన్నికల నేపథ్యంలో ఒత్తిడిలో ఉన్న ఎన్నికల పరిశీలకులు ఆటలతో కాసేపు రిలాక్స్ అయ్యారు. శనివారం సాయంత్రం అశోక్‌నగర్‌లోని డీఎస్ ఏ ఇండోర్ స్టేడి యంలో కేంద్ర ఎన్ని కల పరిశీలకులు అజయ్ నాథ్ ఝా, విలాస్, నగరపాలక సంస్థ కమిషనర్ మేఘా స్వరూప్ క్రీడాకారులతో గడిపారు. మొదట షటిల్ బ్యాడ్మింటన్ ఆడిన అధికారులు, ఫెన్సింగ్, బాస్కెట్‌బాల్, కబడ్డీ ఆటలు ఆడారు. క్రీడా కారులతో ముచ్చటించారు. డీఎస్‌డీఓ షఫీ ఇండోర్‌స్టేడియంలో ఇచ్చే కోచింగ్, క్రీడలపై వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డీఎస్‌డీఓ రమణ, కోచ్‌లు అనీల్‌కుమార్, రాఘవేంద్ర, జెబీవుల్లా, నరేష్ కుమార్, వంశీ, సంధ్య లక్ష్మి పాల్గొన్నారు.



ఫెన్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎన్నికల పరిశీలకులు

మామిడి చెట్లు దగ్ధం

ఆత్మకూరు ఏప్రిల్ 27 : మండలంలోని పి సిద్దరాంపురం గ్రామవాసి, రైతు రాజేష్‌కు చెందిన మామిడి చెట్లు శనివారం విద్యుదాఘాతంతో దగ్ధమయ్యాయి. అతను నాలుగు ఎకరాల్లో 450 మామిడి చెట్లు సాగు చేశాడు. తోట సమీపంలోని ట్రాన్‌ఫార్మర్ నుంచి నిప్పురవ్వలు పడి.. మంటలు చెలరేగాయి. ఆ మంటలు పొలం వరకూ వ్యాపించి.. పొలంలోని 450 చెట్లూ దగ్ధమయ్యాయి. ప్రభుత్వ అధికారులు పరిశీలించి.. పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు రాజేష్ విజ్ఞప్తి చేస్తున్నాడు.





వైభవంగా సంకష్ట చతుర్థి పూజలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 27 : చైత్రమాస సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడో రోడ్డులోని షిరిడి సాయిబాబా దేవాలయంలో గణనాథుని మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం సంకష్టహర వ్రతాలను ఆచరించారు.

టీడీపీలోకి వైసీపీ ఉప సర్పంచ్

శింగనమల ఏప్రిల్ 27: సోదనపల్లి వైసీపీ ఉప సర్పంచ్ బ్యాళ్ల శ్రీనివాసులు వైసీపీ వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం అనంతపురం బండరు శ్రావణిశ్రీ స్వగృహం వద్ద ఆయనతో పాటు వైపీపీ నాయకులు అట్టే పరుసురాం, బ్యాళ్ల లింగమయ్య... 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారిని బండారు శ్రావణిశ్రీ అమ్మ బండారు లీలావతి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో లాయర్ ఈశ్వర్‌రెడ్డి, రామాంజినేయులు, చింతబరిదొర, శంకర్, చౌడప్ప, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ముంటిమడుగు విరాళం

గార్లదిన్నె, ఏప్రిల్ 27: మండలంలోని కల్లూరు పంచాయతీలోని కొండకింద కొట్టాలలో నిర్మిస్తున్న సుంకులమ్మ దేవాలయానికి ముంటిమడుగు సోదరులు రూ. 6.11 లక్షలను విరాళం అందజేశారు. ముంటిమడుగు సోదరులు ముంటిమడుగు శ్రీకాంత్‌రెడ్డి, ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి కలిసి ఆ నగదును ఆ ఆలయ సభ్యులకు శుక్రవారం అందజేశారు.

ప్రథమ చికిత్సపై అవగాహన తప్పనిసరి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 27: ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరికి అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి మోహన్‌కృష్ణ, ట్రైనర్ కృష్ణవేణి తెలిపారు. స్థానిక నెహ్రూ యువజన కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే ప్రథమ చికిత్సపై అవగాహన శిక్షణ శిబిరాన్ని శనివారం ప్రారంభించిన వారు మాట్లాడారు. ప్రస్తుత కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నారని, ప్రథమ చికిత్సతో ఆలాంటి వారిని కాపాడుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి నందిత, సభ్యులు అలేఖ్య, షేక్ చాందిని, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ సభ్యులు శేషాద్రి, శీను, రెడ్‌క్రాస్ కార్యకర్తలు ముత్యాలమ్మ, కీర్తి, రాజా పాల్గొన్నారు.

భరోసా ఇవ్వని జగన్ మేనిఫెస్టో



నారాయణస్వామి

అనంతపురంరూరల్, ఏప్రిల్ 27: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోలో రైతులకు ఏ మాత్రం భరోసా ఇచ్చే విధంగా లేదని రాప్తాడు నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు నారాయణస్వామి అన్నారు. శనివారం కురుగుంటలోని తన నివాసంలో ఆయన మాట్లాడారు. కేవలం రైతు భరోసా రూ.16 వేలు ఇస్తామని ప్రకటించారని, వ్యవసాయ పెట్టుబడులకు ఆ సొమ్ము ఏవిధంగా సరిపోతుందో ఆయనే చెప్పాలన్నారు. ఆ సొమ్ము కూడా మూడు విడతల్లో ఇస్తామని చెప్పడం ఆయనకు వ్యవసాయ రంగంపై ఉన్న అవగాహనకు నిదర్శనమన్నారు. టీడీపీ ప్రభుత్వ హయంలో సబ్సిడీతో డ్రిప్ పరికారాలు, వ్యవసాయ ట్రాక్టర్లు ఇలా చాలానే ఇచ్చారన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో రూ.20వేలు పెట్టుబడి సాయం కింద ఇస్తామని చెప్పారన్నారు. దీని బట్టి చూస్తే ఏ పార్టీకి రైతు లపై చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. రైతులు ఇప్పటికైనా అర్థం చేసుకుని చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పేద కుటుంబానికి చేయూత

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 27 : కుటుంబ పెద్దను కోల్పోయిన నిరుపేద కుటుంబానికి నిత్యసురభి ట్రస్టు అండగా నిలిచింది. సోములదొడ్డిలో నివాసముంటున్న లక్ష్మీదేవి భర్త రామాంజనేయులు 20 రోజుల క్రితం మరణించాడు. దీంతో ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్న లక్ష్మీదేవి నిత్య సురభి ట్రస్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో నిత్యసురభి ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి శనివారం ఆ కుటుంబాన్ని కలిసి బియ్యం ప్యాకెట్, 32 రకాల నిత్యావసర సరుకులు, రూ.3వేలు నగదు సాయంను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటలక్ష్మి, నాగరాజు, అలివేలు మంగమ్మ, నారాయణమ్మ, కళావతి, కురుబ లింగన్న, నీలమ్మ, సంగమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

శింగనమల ఏప్రిల్ 27: శింగనమల నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ వినోద్‌కుమార్ తనిఖీ చేశారు. శనివారం సాయంత్రం శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న విత్ డ్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం శింగనమలలోని నాలుగు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని స్థానికులకు సూచించారు. ఆయన వెంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీను వెన్నెల, తహసీల్దార్ శోభన్‌బాబు ఉన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని కేకే అగ్రహారం, వెంకటాపురం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ శోభారాణి ఉన్నారు.

గార్లదిన్నె : గార్లదిన్నె, కల్లూరు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ శనివారం రాత్రి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలూ లేకుండా సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారుకు సూచించారు.

ముగిసిన జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం

అనంతపురంరూరల్, ఏప్రిల్ 27: మండలంలోని ఆలమూరులో శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల, ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వారం రోజులుగా నిరహిస్తున్న జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం శనివారంతో ముగిసింది. ఈ వారం పాటు ఆ కళాశాలకు చెందిన విద్యార్థులు వివిధ సేవా కార్యాక్రమాలు చేపట్టారు. శనివారం రైతులతో ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ రవీంద్రనాథరెడ్డి భూసార పరీక్షలు, వర్షను నీటిని నిల్వ చేసే విధానం తదితర వాటిని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు రామకృష్ణ, జాతీయ సేవా పథకం అధికారి వెంకటేష్, భానురేఖ, సువర్ణ, బోధన సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు ఓటు ప్రాధాన్యంపై అవగాహన ర్యాలీ

హాజరు కానున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 27: ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా ప్రతినిధి మమత, ఎన్నికల నిఘావేదిక రీజనల్ కన్వీనర్ కంబదూరు షేక్ నబీరసూల్ తెలిపారు. ఉదయం 8గంటలకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మైదానం నుంచి శ్రీకంఠం సర్కిల్, రాజురోడ్డు, సప్తగిరిసర్కిల్, సుభాష్‌రోడ్డు, టవర్‌క్లాక్ మీదుగా ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ సాగుతుందని తెలిపారు. అధిక సంఖ్యలో ఓటర్లు హాజరై ర్యాలీ విజయవంతం చేయాలని కోరారు.

తాగునీరు ఇవ్వలేని విశ్వను ఓడించండి

● ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కేశవ్, అంబికా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

కూడేరు, ఏప్రిల్ 27: ఉరవకొండ నియోజకవర్గానికి తాగునీరు కూడా ఇవ్వలేని అసమర్థుడైన విశ్వేశ్వరరెడ్డిని ఓడించాలని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు పయ్యావుల కేశవ్, అంబికా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శనివారం మండలం ఉదిరిపికొండ, శివరాంపేట, ఉదిరిపికొండ తండా, మరుట్ల 3, 2, 1వ కాలనీలతోపాటు ఇప్పేరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కూటమి అభ్యర్థులకు గజమాలలతో, మహిళల హారతులతో ఘన స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ తాగునీటి పథకాలను కూడా సక్రమంగా నడపలేని వైసీపీ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అరాచకం పెరిగిపోయిందని, అభివృద్ధి ఏమాత్రం జర


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

గలేదన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని, టీడీపీ అధికారంలోకి రాగానే ఉచిత బస్సు ప్రయాణం, మూడు గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగులకు మెగా డీఎస్సీ, విద్యార్థులకు, యువత, మహిళలు, అన్నదాతలకు, కార్మికులతోపాటు అన్ని వర్గాలకు ఆర్థికంగా అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తారన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని జనసేన, బీజేపీ నాయకులు కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ ఎంపీపీ బ్రహ్మయ్య, జనసేన నియోజకవర్గ నాయకుడు గౌతం, బీజేపీ జిల్లా నాయకుడు కొనకొండ్ల రాజేష్ పాల్గొన్నారు.

టీడీపీలోకి మాజీ సర్పంచ్ కుటుంబం..

విడపనకల్లు: మండల కేంద్రంలో వైసీపీకి భారీ ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీ మాజీ సర్పంచ్ సుంకన్న సోదరుడు, కొమ్మె ఎర్రిస్వామి, గోపాల్, హనుమంతు, గురుస్వామి, కౌకుంట్లలోని పయ్యావుల శ్రీనివాసులు అధ్వర్యంలో శనివారం టీడీపీలోకి చేరారు. వీరికి శ్రీనివాసులు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ సినిమా రామాంజనేయులు, హనుమంతు, టీ రామాంజనేయులు, గోవన్న, సూరి పాల్గొన్నారు.

వార్డు సభ్యుల చేరిక

ఉరవకొండ: పంచాయతీకి చెందిన వైసీపీ వార్డు సభ్యులు టీడీపీలోకి చేరారు. దీంతో ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వైసీపీకి చెందిన నిరంజన్‌గౌడ్, వేల్పుల వాసుదేవ్, బోయ పద్మావతి, ఆమె భర్త శ్రీనివాసులు ఎమ్మెల్యే కేశవ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. పార్టీ గెలుపు కోసం కృషిచేయాలని సూచించారు.

రెండు శాఖలతో సరి..


మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దీపిక

కుందుర్పి, ఏప్రిల్ 27: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కమలమ్మ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. 24 శాఖలకు గాను రెండు శాఖల మీద చర్చించి సమావేశం ముగించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దీపిక మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారించడానికి బోరుబావులను తవ్వించామన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్లు తవ్వినా ప్రయోజనం లేదని దానికి ప్రత్యామ్నాయంగా చేతిపంపులను మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్, జడ్పీటీసీ రాధా స్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పద్మావతమ్మ అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా సాగింది. మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యతోపాటు ఉపాధిహామీ కూలీలకు పనులు సక్రమంగా కల్పించాలని, ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ గోపికృష్ణ, ఏపీఓ పుల్లారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

యల్లనూరులో కార్డెన్ సెర్చ్


యల్లనూరులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

యల్లనూరు, ఏప్రిల్ 27: మండలకేంద్రంలో శనివారం తెల్లవారుజామున రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ గృహాల్లో తనిఖీలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎటువంటి కవ్వింపు చర్యలకు దిగరాదని హెచ్చరించారు. ఆయన వెంట యల్లనూరు ఎస్ఐ గిరిబాబు, కేంద్రబలగాలు ఉన్నాయి.

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరు గ్రామంలో శనివారం సీఐ ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. గ్రామంలోని ఇరువర్గాలకు సంబంధించి ఇళ్లు, గడ్డివాములు తనిఖీలు చేశారు.

రైలు కిందపడి బెంగాల్ వాసి మృతి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 27: గుంతకల్లు-అనంతపురం రైలు మార్గంలోని గూళ్లపాళ్యం రైల్వేస్టేషన్ సమీపంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన విశ్వజీత్ నస్కల్ (29)అనే వ్యక్తి శనివారం రైలు కింద పడి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. మృతుడి వద్ద ఆధార్ కార్డులో వెస్ట్‌బెంగాల్ రాష్ట్రం నారాయణ్‌భర్ అడ్రసు ఉందన్నారు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీంచి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

యాడికి, ఏప్రిల్ 27: ఇంట్లో సరుకుల కోసం భర్తతో గొడవపడి విషద్రావకం తాగి శ్రావణి (36) అనే మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం యాడికి మండలం కోనుప్పలపాడులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు కోనుప్పలపాడు గ్రామానికి చెందిన శ్రావణి, వీరబ్రహ్మయ్య వ్యవసాయ పనుల ద్వారా జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంట్లో సరుకులు లేవని భార్యాభర్తలు శనివారం గొడవపడ్డారని తెలిపారు. క్షణికావేశంలో శ్రావణి విషద్రావకం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. శ్రావణి తండ్రి రంగస్వామి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని హిజ్రా...

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 27: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనక నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో హిజ్రా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు కోలాట్ల విజయ్ అలియాస్ విద్య(17) రెండు సంవత్సరాల క్రితం హిజ్రాగా మారిందన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందన్నారు. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని వారు పరిశీలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కళ్యాణదుర్గం అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో


బొమ్మనహాళ్‌లో ఎద్దులబండిపై అమిలినేని సురేంద్రబాబు


అమిలినేనికి గజమాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

● త్వరలోనే విడుదల చేస్తాం: అమిలినేని

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 27: కళ్యాణదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి 12 అంశాలతో త్వరలోనే ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసి, అమలు చేసేందుకు కృషిచేస్తానని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శనివారం బ్రహ్మసముద్రం మండల కొర్లగుంద, తీటకల్లు, కొత్తిండ్లు, ఎనకల్లు, రాయలప్పదొడ్డి, ముద్దలాపురం, గుడిపల్లి, కన్నేపల్లి, బుడిమేపల్లి, అజ్జయ్యదొడ్డి, చెలిమేపల్లి, గోవిందయ్య దొడ్డి, వేపులపర్తి గ్రామాల్లో సురేంద్రబాబు అశేష జనవాహిని మధ్య రోడ్‌షో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు, నాయకులు, పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. అమిలినేని మాట్లాడుతూ కళ్యాణదుర్గం ప్రాంత అభివృద్ధికి సూపర్‌సిక్స్ పథకాలతోపాటు 12 అంశాలతో కూడిన మేనిఫెస్టోను అమలు చేస్తానన్నారు. ప్రతి గ్రామానికి శుద్ధనీటిని అందించి ప్రజల దాహార్తిని తీర్చుతామన్నారు. ప్రతి టీడీపీ కార్యకర్తకు అండగా వుంటూ ఆదుకుంటామన్నారు. ఐదేళ్ల కాలంలో చీకటి జీవితాలతో మగ్గుతున్న వారిలో వెలుగులు నింపే రోజులు దగ్గర్లో వున్నాయన్నారు. కళ్యాణదుర్గం జీవనాడి బీటీపీని పూర్తిచేసి ప్రతి చెరువును నీటితో నింపుతానన్నారు. గతంలో ప్రజలను ఇబ్బంది పెట్టి భూకబ్జాలు, ఇసుక అక్రమ రవాణా చేసి ఇక్కడి నుంచి వేరే ప్రాంతానికి వెళ్లిపోయారని పరోక్షంగా మంత్రి ఉషశ్రీచరణ్‌పై విమర్శలు గుపిపంచారు. మంచి చేయాలన్న ఉద్దేశంతో మీ ముందుకు వచ్చానన్నారు. చంద్రబాబునాయుడును సీఎంగా చేసుకోవాలన్నారు. గత టీడీపీ హయాంలో మూడు నెలల్లో 20 కిలోమీటర్ల కాలువ తవ్వామని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఒక జీవో తీసుకువచ్చి ఆ కాలువ పనులను ఆపేశారన్నారు. ప్రతి గ్రామానికి రోడ్లు వేసి పదేళ్ల పాటు చెక్కుచెదరకుండా అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. ఈ రోజు ఏ గ్రామంలో చూసినా ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఆ ప్రజాదరణతోనే కళ్యాణదుర్గంలో టీడీపీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 50 వేల మెజార్టీతో టీడీపీ గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీనాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సురేంద్రబాబు తమ్ముడు శ్రీరామ్

రైతుగా మారిన అమిలినేని: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు రైతుగా మారాడు. శనివారం బ్రహ్మసముద్రం మండలంలో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఎద్దులబండి నడుపుతూ అందరినీ ఉత్తేజపరిచాడు. కంబదూరు మండలంలో సురేంద్రబాబు తమ్ముడు శ్రీరామ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం..
ఎన్నికల ప్రచారంలో అమిలినేని కుటుంబం

కుందుర్పి: నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తామని అమిలినేని కుటుంబ సభ్యులు తెలిపారు. మండలం బొమ్మజ్జిపల్లి, తమ్మయ్యదొడ్డి గ్రామాల్లో శనివారం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సురేంద్రబాబు సతీమణి రమాదేవి, రాధామాధవి, కుమార్తె చరిత, కుటుంబ సభ్యులు ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతూ ముందుకు సాగారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కనీసం రోడ్లు వేయలేదని గ్రామాలలో సీసీ రోడ్లు కూడా వేయలేదని, మరి గ్రామాల అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందో అర్థం కావట్లేదన్నారు. మే 13న ప్రతి ఒక్కరూ టీడీపీ సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇంతకుముందు గ్రామంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

గ్రామాల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

● గుమ్మనూరు జయరాం, వెంకటశివుడు యాదవ్

గుత్తిరూరల్, ఏప్రిల్ 27: రాష్ట్రంలోని గ్రామాలు అభివృద్ధి చేందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. శనివారం మండలంలోని తొండపాడు, గొందిపల్లి, టీ.కొత్తపల్లి గ్రామాలల్లో వారు ప్రచారం నిర్వహించారు. వారు మాట్లడుతూ చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేస్తే రాష్ట్రం బాగుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలుపించాలన్నారు. తొండపాడులో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన 30 కుటుంబలకు కండువా వేసి ఆహ్వానించారు. టీడీపీ మండల కన్వీనర్ బర్దివలి, సీనియర్ నాయకులు కేసీ హరి చిన్నరెడ్డి యాదవ్, గుమ్మనూరు నారాయణ, పత్తి హిమబిందు, సర్పంచు భరత్, ఎంపీటీసీ జింకల నారాయణస్వామి, లక్ష్మీనారాయణమ్మ, రంగారెడ్డి యాదవ్, గోవర్ధన్ గౌడ్, సుధీర్ గౌడ్, వెంకటనారాయణ, రామాంజనేయులు, శివశంకర్, సాంబ శివ, రవితేజ నారాయణస్వామి ఏంకే చౌదరి, ప్రతాప్, గోవిందు, లక్ష్మీరంగయ్య, రామచంద్ర యాదవ్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలసిన గుమ్మనూరు

గుత్తి: పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కే మధుసూదన్ గుప్తాను శని


మాజీ ఎమ్మెల్యేతో గుమ్మనూరు జయరాం

వారం గుంతకల్లు టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఆయనను కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పం దించారు. పత్తిహిమబిందు, స పంత్, ఆనంద్, వెంకటశివుడు, గోవిందు, రామణ గుప్తాను కలిసిన వారిలో ఉన్నారు.


మాట్లడుతూన్న జయరాం

మైనారిటీలు అండగా నిలవండి

గుంతకల్లు: ముస్లిం మైనార్టీలు రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గుమ్మనూరు జయరాంను గెలిపించాలని గుమ్మనూరు నారాయణ స్వామి ప్రచారం చేశారు. శనివారం పట్టణంలోని 35వ వార్డు, సాయంత్రం 22వ వార్డులో ప్రచారం నిర్వహించారు. పవన్‌కుమార్ గౌడు, గుజరీ మహ్మద్ ఖాజా, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, కౌన్సిలర్లు గుడిపాటి ఆంజనేయులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం

పామిడి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సంక్షేమం సాధ్యపడుతుందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్ అన్నారు. పట్టణంలోని 15, 16, 17 వార్డులలో శనివారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ లక్ష్మీకాంతమ్మ, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్ పీరా పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 27: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం సందర్భంగా విశేషపూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు సంతోష్‌కుమార్‌చార్యులు పూజలు నిర్వహించారు. వేకువజామున, సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, విష్ణు పారాయణం, అష్టోత్తర నిర్వహించి వెండికవచ అలంకరణ, పుష్పలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదాన చేశారు. సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు. మాజీ ధర్మకర్త కాశీనాథ్‌శెట్టి సిబ్బంది ఓబున్న పాల్గొన్నారు.


అలంకరణలో స్వామివారు

రాయదుర్గంరూరల్: మండలంలో వెలసిన అప్పలాపురం ఆంజనేయస్వామి దేవాలయం, మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాలలో ఉదయాన్నే పంచామృతాభిషేకం, కుంకుమార్చన, వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా పల్లకి సేవ


ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, ఏప్రిల్ 27: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 27: ఓటర్లు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఏఆర్‌ఓ చిట్టిబాబు సూచించారు. శనివారం మండలంలోని కొండాపురం గ్రామంలో కేంద్ర బలగాలతో సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. గ్రామంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు ఉంటుందని, దానిని వినియోగించుకోవాలన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన: అశ్మిత్‌రెడ్డి


వృద్ధుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 27: చంద్రబాబునాయుడుతోనే సుపరిపాలన సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కృష్ణాపురంరోడ్డులో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సైకిల్‌గుర్తుకు ఓటువేసి అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. టీడీపీకి అండగా నిలబడి ఊరును బాగు చేసుకుందామని ప్రజలను అభ్యర్థించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు పాపిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్, పవన్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, విజ్జి, నరేంద్రనాయుడు, ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: వచ్చే ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపిస్తే మండలంలో అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని లక్షుంపల్లి గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, సతీష్‌రెడ్డి, రమేష్‌యాదవ్, ప్రసాద్‌యాదవ్, రామాంజులరెడ్డి పాల్గొన్నారు.

కష్టపడి పనిచేయండి: జేసీ దివాకర్‌రెడ్డి

పెద్దవడుగూరు: ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేస్తే గెలుపు మనదేనని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చింతలచెరువు గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్‌గుర్తుకు ఓటువేసి కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, గంగరాజుయాదవ్, ఆదిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

జేసీ పవన్‌రెడ్డిని కలిసిన భవన నిర్మాణ కార్మికులు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 27: పట్టణంలోని కృష్ణాపురం 8వరోడ్డులో ఉన్న ప్లైవుడ్‌షాపు వద్ద టీడీపీనేత జేసీ పవన్‌రెడ్డిని శనివారం భవన నిర్మాణ కార్మికులు కలిశారు. పవన్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. అనంతరం భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ వైసీపీ పాలనలో కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన నిధులను వైసీపీ ప్రభుత్వం తమ ఉచిత పథకాలకు వాడుకొని దుర్వినియోగం చేసిందన్నారు. కార్మికుల జీవితాలు బాగుపడడానికి మేనిఫెస్టోలో పొందుపరిచేవిధంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లాలని పవన్‌రెడ్డిని కార్మికులు కోరారు. స్పందించిన ఆయన టీడీపీ అధికారంలోకి రాగానే కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు.


జేసీ పవన్‌రెడ్డిని సన్మానిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

టీడీపీని గెలిపిస్తే ప్రతి మహిళకు రూ.15వేలు

● కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కాలవ

రాయదుర్గం, ఏప్రిల్ 27: ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.15వేలు అందిస్తామని కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని 28వ వార్డులో ఆయన ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుంటేనే రాష్ట్రానికి భవిష్యత్తు వుంటుదన్నారు.

మెట్టుకు ఓటేస్తే చెత్తబుట్టలో వేసినట్లే: వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డికి ఓటువేస్తే చెత్తబుట్టలో వేసినట్లేనని కాలవశ్రీనివాసులు ధ్వజమెత్తారు. శనివారం పట్టణంలోని గుమ్మఘట్ట రోడ్డులోని తోటలో యాదవులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ హాజరయ్యారు. కాలవ మాట్లాడుతూ మెట్టుగోవిందరెడ్డికి రాజకీయ భిక్ష పెట్టిందే నేనన్నారు. యాదవులకు పదవులను ఇచ్చి రాజకీయంగా టీడీపీ వారిని ముందుకు తీసుకెళుతోందన్నారు.

22 కుటుంబాల చేరిక: మండలంలోని వేపరాల గ్రామానికి చెందిన 22 వైసీపీ కుటుంబాలు శనివారం టీడీపీలో చేరాయి. కృష్ణ, ప్రభాకర, వన్నూరుస్వామి, నగేష్, రాజు, సురేష్, దేవదాసు, తిప్పేస్వామి, నరసింహులు, గంగాధర, చిన్నవన్నూరప్ప, వంద్రయ్యలతో పాటు పార్టీలో చేరిన వారికి కాలవ శ్రీనివాసులు తన నివాసంలో పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

బటన్ నొక్కి.. కోట్లు దోచుకున్న జగన్

బొమ్మనహాళ్: జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల పేరుతో బటన్ నొక్కి ప్రజల నుంచి కోట్లు దోచుకున్నాడని కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. శనివారం బొల్లనగుడ్డం, కళ్లుహోళ, తారకాపురం, కళ్లదేవనహళ్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. జగన్ పాలనలో నిత్యావసర సరుకులు, విద్యుత్ చార్జీలు, బస్సు చార్జీలు, ఇంటి పన్నులు పెంచి చెత్తపన్నులు వేసి దోచుకుంటున్నాడని విమర్శించారు.


ప్రచారం నిర్వహిస్తున్న కాలవ

కుటుంబీకుల ప్రచారం: కాలవ శ్రీనివాసులును గెలిపించాలని ఆయన సతీమణి విజయలక్ష్మి పట్టణంలోని 26వ వార్డులో ప్రచారం చేయగా, కుమార్తె గౌతమి కణేకల్లు మండలం కొత్తపల్లి గ్రామంలో, అల్లుడు అనిల్ డీ.హీరేహాళ్ మండలం నాగలాపురం గ్రామంలో ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

అండగా ఉంటాం.. ఆదరించండి..

కణేకల్లు, ఏప్రిల్ 27: టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలకు ఏమి కష్టం వచ్చినా అండగా ఉంటామని తమను ఆదరించాలని టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ తనయుడు అంబికా విక్షిత్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. టీడీపీనేత చంద్రబాబునాయుడు, బాలకృష్ణ, లోకేష్‌లు ఎంపీ అభ్యర్థిగా తన తండ్రికి అవకాశం ఇచ్చి ప్రజల్లో ఉండేలా చేశారన్నారు. కొత్తపల్లి, ఆదిగానిపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తూచ్..!

● ఆటోలపై తొలగని పోస్టర్లు

కణేకల్లు, ఏప్రిల్ 27: ఎన్నికల నిబంధనలను బేఖాతరు చేస్తూ ఓ పార్టీ అభ్యర్థి ప్రయాణికులు తిరిగే ఆటోలపై రైతుల పక్షం పేరుతో తన ఫొటోను ముద్రించి ఉన్న పోస్టర్లు మండల వ్యాప్తంగా హల్‌చల్ చేస్తున్నాయి. రాయదుర్గం పట్టణానికి చెందిన గౌని ప్రతాప్‌రెడ్డి భారతచైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. గతంలో మేము రైతులపక్షం అనే పేరుతో చాలా ప్యాసింజర్ ఆటోలపై తన పోస్టర్లు వేయించారు. ఎన్నికల నియమావళి అమలులో వున్నా అధికారులు ఇప్పటివరకు ఆటోలపై వున్న పోస్టర్లను తొలగించకపోవడం గమనార్హం.


ఆటోలకు వున్న పోస్టర్లు

వైసీపీ ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్లు

పుట్లూరు, ఏప్రిల్27: మండలంలోని కడవకల్లులో శుక్రవారం సాయం త్రం వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎం డీయూ ఆపరేటర్లు పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. కడవకల్లుకు చెందిన రమేష్, జయచంద్ర ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.


ప్రచారంలో పాల్గొన్న ఆపరేటర్లు (వృత్తాల్లో)

నేడు కాలవ పర్యటన ఇలా..

రాయదుర్గం, ఏప్రిల్ 27: టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ఆదివారం బొమ్మనహాళ్ మండలంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు కురువళ్ళి, 11కు చంద్రగిరి, 12 గంటలకు సిద్ధరాంపురం, మధ్యాహ్నం 3 గంటలకు నేమకల్లు, సాయంత్రం 4గంటలకు ఉంతకల్లు గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించనున్నారు.

నేడు టీడీపీ ప్రచారం

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప, గంగవరం గ్రామాల్లో ఆదివారం ప్రచారం చేస్తున్నట్లు మండల కన్వీనర్ ప్రసాద్ శనివారం తెలిపారు. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ తనయుడు విజయసింహా పాల్గొంటారన్నారు.

అటానమస్ హోదాపై సంబరాలు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 27: పట్టణంలోని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా రావడంపై శనివారం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. పట్టణ పురవీధుల్లో బాణాసంచ పేల్చి, నృత్యాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ప్రిన్సిపాల్ గోపాల్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్ సురేష్‌బాబు, ప్రజా సంబంధాల అధికారి క్రిష్ణయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ నటరాజ్, అధ్యాపకులు వెంకటరమణ, గోపి, రాకేష్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఖాజావలి, సత్యబాబు, ప్రకాష్, శ్రావణి, సుభాషిని, వెంకటసుబ్బమ్మ, సువర్ణదేవి పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 27: పట్టణంలో పాలిసెట్ 2024 పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని నాలుగు పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1072 మంది విద్యార్థులకు గాను 953 మంది హాజరైనట్లు పాలిసెట్ కో ఆర్డినేటర్ అశ్రఫ్ అలీ తెలిపారు.